కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ మంగళవారం 31 డిసెంబర్ 2024
సంపుటి: 14, సంచిక: 272 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## పేర్ని నాని భార్యకు ముందస్తు బెయిల్

### బియ్యం మాయం కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధ



మచిలీపట్నం డిసెంబర్ 30 (నిఘా న్యూస్): మాజీ మంత్రి పేర్ని నాని భార్య జయసుధకు మచిలీపట్నం కోర్టులో ఊరట దక్కింది. అయితే విచారణకు సహకరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని నాని ..మిగతా 2లో

## ఏపీ నూతన సీఎస్‌గా విజయానంద్

బీసీ అధికారి విజయానంద్‌కు సీఎస్‌గా అవకాశం



2

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్... తెలంగాణ ఆత్మ బంధువు

### సరళీకృత ఆర్థిక విధానాలతో ప్రపంచంతో పోటీపడేలా పునాదులు వేసిన ఘనుడు



హైదరాబాద్ డిసెంబర్ 30(నిఘా న్యూస్): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ అసెంబ్లీ ఘనంగా నివాళి అర్పించింది. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయన సేవలను కొనియాడుతూ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో తెలంగాణ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఆయన సంతాప తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడారు. మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలు అందించారని రేవంత్ గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని చెప్పారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవలందించారని ..మిగతా 2లో

- ఉపాధిహామీ, ఆర్టీఐ, ఎన్‌హెచ్ఆర్ఎంను ప్రారంభించారు
- ప్రతి వ్యక్తికి గుర్తింపునిచ్చేలా ఆధార్ కార్డును ప్రవేశపెట్టారు
- మన్మోహన్ సింగ్ నేతృత్వంలోనే తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం
- భారత రత్న ప్రకటించాలని అసెంబ్లీ ప్రత్యేక తీర్మానం
- దేశ గతిని మార్చిన నేత మన్మోహన్ అని మంత్రుల కితాబు
- మన్మోహన్‌కు శాసనసభ ఘన నివాళి
- ఆర్థిక రూపశిల్పి అని కొనియాడిన సీఎం రేవంత్

నీతి, నిజాయతీ, నిబద్ధత కలిగిన నేత, జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి

### ఢిల్లీలో పీవీకి గుర్తింపు దక్కాలి



మన్మోహన్ నేతృత్వంలోనే తెలంగాణ ఆవిర్భావం
రాజకీయాలకు అతీతంగా ఆర్థిక బాధ్యతలు అప్పగించారు
మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలన్న తీర్మానానికి ఆమోదం
అసెంబ్లీ సమావేశంలో కేటీఆర్ ప్రసంగం

2



## ఉగాది నుంచి ఉచిత బస్సు!

### ఈ విధానం అమల్లో ఉన్న కర్ణాటక, ఢిల్లీ తెలంగాణ రాష్ట్రాలలో అధ్యయనం

### ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన చంద్రబాబు

అమరావతి డిసెంబర్ 30(నిఘా న్యూస్): అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలోని మరో హామీని నెరవేర్చే దిశగా ఏపీ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే దిశగా చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు పలువురు ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు కీలక చర్చలు జరుపుతున్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీఎండీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం అంశంపై తీసుకుంటున్న చర్యలపై సీఎం ఆరా తీశారు. ఈ విధానం అమల్లో ఉన్న కర్ణాటక, దిల్లీ, తెలంగాణ రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తామని అధికారులు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదికను వీల్కెనంత త్వరగా అందజేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఉగాది నాటికి పథకం అమల్లోకి తెచ్చేలా పనులు వేగవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు.

## నేటి రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం

తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం.. న్యూ ఇయర్ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు
సైబరాబాద్ పరిధిలో ఫ్లై ఓవర్ల మూసివేత.. డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు యధాతథం
అర్ధరాత్రి వరకు మెట్రో రైల్ సర్వీసులు

2

## ఏపీకి రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు



2,63,411 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
క్లీన్ ఎనర్జీ పాలసీతో ఏపీలో పెట్టుబడులకు దేశ విదేశీ సంస్థల క్యూ
ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

అమరావతి డిసెంబర్ 30(నిఘా న్యూస్): ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీలో పలు ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయడానికి సీఎం చంద్రబాబు రూపకల్పన చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఏపీకి మరో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. పెట్టుబడులు ఏపీకి రావడం వల్ల 2,63,411 ..మిగతా 2లో

## రాయలసీమకు... గేట్ వే కానున్న బనకచర్ల

బనకచర్లతో తెలుగుతల్లికి జలహారతి
నదుల అనుసంధానంతో కృష్ణానీటికి అడ్డుకట్ట
ప్రాజెక్టులపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్




2

## గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చారు

### చిరంజీవి కూడా సినిమా చూసేందుకు వెళ్లేవారు

### కానీ ముసుగు వేసుకుని ఒక్కరే వెళ్లేవారు

### సంధ్య థియేటర్ ఘటనపై పవన్ వ్యాఖ్యలు




గుటూరు డిసెంబర్ 30(నిఘా న్యూస్): గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన, సినీనటుడు అల్లు అర్జున్ అరెస్ట్‌పై పవన్ కళ్యాణ్ స్పందించారు. మంగళగిరిలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప నాయకుడుని, కిందిస్థాయి నుంచి ఎదిగారని కితాబునిచ్చారు. వైకాపా విధానాల తరహాలో అక్కడ వ్యవహరించలేదు. ఆ రాష్ట్రంలో బెనిఫిట్‌షోలకు అవకాశమిచ్చారు. టికెట్ ధర పెంపునకూ వెసులుబాటు కల్పించారు. ఆయన సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయి. 'సలార్', 'పుష్ప2'వంటి సినిమాలకు భారీ వసూళ్లు వచ్చాయి. 'పుష్ప2' సినిమాకు సీఎం రేవంత్ పూర్తిగా సహకరించారు. టికెట్ రేట్ల పెంపునకు అవకాశం ఇవ్వడం కూడా చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడమే అవుతుందని అన్నారు. అల్లు అర్జున్ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. చట్టం అందరికీ సమానం. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టను. భద్రత గురించే వారు ఆలోచిస్తారు. థియేటర్ స్టాఫ్ కూడా అల్లు అర్జున్‌కు ముందు చెప్పి ..మిగతా 2లో

## సత్య నాదెళ్లను కలిసిన సీఎం రేవంత్

### ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు వినతి

హైదరాబాద్ డిసెంబర్ 30 (నిఘా న్యూస్): తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని మైక్రోసాఫ్ట్ సిఇవో సత్యనాదెళ్లను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. సత్య నాదెళ్లను ఆయన నివాసంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీలో మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యం, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ ప్రతిపాదనలు, ఏఐ సిటీలో ఆర్‌అండ్‌డీ ఏర్పాటుకు సహకారంపై చర్చించారు. క్లౌడ్ కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చర్చిస్తూ, క్లౌడ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కీలక పాత్ర పోషించాలని సీఎం కోరారు. ఓపెన్ ఏఐ నుంచి ఉచిత క్రెడిట్ ఇవ్వాలని మైక్రోసాఫ్ట్ సీఈవోకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నాలుగు డేటా సెంటర్లు, హైదరాబాద్ కేంద్రంగా విస్తరణ తదితర అంశాలపై సీఎం చర్చించారు. సత్య నాదెళ్ల వ్యక్తిగత పర్యటన కోసం ఇండియాకు వచ్చారు. బంజారాహిల్స్ లోని ఆయన నివాసంలో ఉన్న సత్య నాదెళ్లను అధికారికంగా కాకుండా మర్యాద పూర్వకంగా ప్రభుత్వ పెద్దలు కలిసినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో సాఫ్ట్ వేర్ రంగ అభివృద్ధి కోసం సత్యనాదెళ్ల సూచనలు, సలహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగినట్లుగా ..మిగతా 2లో



## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ స్మారకం

### అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్ డిసెంబర్ 30(నిఘా న్యూస్): తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవిత చరిత్ర తెలిపేలా స్మారకం ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ మన్మోహన్ సింగ్ విగ్రహాలు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఇటీవల మరణించిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపేందుకు తెలంగాణ అసెంబ్లీ సోమవారం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మెచ్చిన ఆర్థిక వేత్త ..మిగతా 2లో



## కాశ్మీర్‌ను కప్పేసిన మంచు దుప్పటి

### యూనివర్సిటీ పరీక్షలు వాయిదా




2

## విమానయానాలకు చీకటి నెల డిసెంబర్

### వివిధ ప్రాంతాల్లో ఏడు ఘోర ప్రమాదాలు.. ఏకంగా 240 మంది దుర్మరణం

న్యూఢిల్లీ డిసెంబర్ 30 (నిఘా న్యూస్): 2024 ముగింపునకు చేరింది మరికొన్ని గంటల్లో కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ప్రపంచం మొత్తం సిద్ధమవుతోంది. అయితే, ఏడాది చివరి నెల డిసెంబర్ విమానయాన చరిత్రలో 'చీకటి నెల'గా నిలిచింది. ఎందుకంటే డిసెంబర్ నెలలో ఏకంగా ఏడు ఘోరమైన విమాన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మొత్తం ఏడు ప్రధాన ఘటనల్లో ఏకంగా 240 మంది మరణించడం కలచివేస్తోంది. ఈ ఒక్క నెలలో ..మిగతా 2లో



## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ స్మారకం

మొదటి పేజీ తరువాయి...

మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. ఉన్నత స్థానాల్లో ఉన్నప్పటికీ, ఆయన ఎప్పుడు నిరాడంబరంగా జీవించేవారని చెప్పారు. దేశంలో నోట్లు రద్దు చేస్తే భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని మన్మోహన్ సింగ్ ఎప్పుడు చెప్పేవారని, కేంద్ర ప్రభుత్వం 2016లో నోట్లు రద్దు చేసిన తర్వాత మన్మోహన్ సింగ్ చెప్పిందే నిజమైందన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. రెండేళ్ల కిందట 92 ఏళ్ల వయసులోనూ మన్మోహన్ సింగ్ ధర్నా చేశారని, అప్పుడు తనకు ఆయనను కలిసే అవకాశం వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి యాది చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ ఆర్బీఐలో అనేక మార్పులు తీసుకొచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీలో మన్మోహన్ మృతిపై సంతాప తీర్మానం సందర్భంగా మాట్లాడిన ఆయన, కరీంనగర్ ముద్దుబిడ్డ పీవీ ఆధ్వర్యంలో మన్మోహన్ ఆర్థిక మంత్రి అయ్యారని చెప్పారు. మన్మోహన్ తో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందన్నారు పొన్నం. మెడికల్ స్కూల్ వ్యవస్థను మన్మోహన్ తీసుకొచ్చారని చెప్పారు. గ్లోబలైజేషన్ తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు పొన్నం. ఆర్టీఐ చట్టంతో పారదర్శకతకు పెద్దపీట దక్కిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మన్మోహన్ సింగ్ 90 ఏళ్ల వయసులో వీల్ ఛైర్ లో వచ్చి రాజ్యసభలో ఓటు వేశారని గుర్తు చేశారు పొన్నం. దేశంలో 72 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశారని తెలిపారు. మన్మోహన్ సింగ్ హైదరాబాద్ కు ఓఆర్ఆర్, మెట్రో రైల్ ప్రాజెక్టులు ఇచ్చారని గుర్తు చేశారు పొన్నం. మన్మోహన్ మృతిపై ప్రపంచ దేశాలు స్పందించాయని మన్మోహన్ సహకారంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందన్నారు.

## నేటి రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం

**హైదరాబాద్ డిసెంబర్ 30(నిఘా న్యూస్):** ఆంగ్ల నూతన సంవత్సరాది మరికొన్ని గంటల్లో రానుంది. ఈ క్రమంలో ప్రపంచమంతా వేడుకలకు సిద్ధం అవుతుంది. న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఆంక్షలు విధించారు. డిసెంబరు 31 రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఐటీ కారిడార్‌లో ఫ్లై ఓవర్లను మూసివేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఓఆర్‌ఆర్‌పై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సిగ్నల్ జంపింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతారని చెప్పారు. మద్యం సేవించిన వారికి పబ్‌లు, బార్ల యాజమానులు ప్రైవేటు వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని పోలీసులు సూచించారు. న్యూఇయర్ వేడుకల దృష్ట్యా డిసెంబరు 31న రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించ నున్నట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం ప్రకటించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 500 కార్లు, 250 క్యాబ్‌లు అందుబాటులో ఉంటాయని అసోసియేషన్ తెలిపింది. ప్రజలు మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, రోడ్డు ప్రమాదాలు జరగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడిరచింది. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మెట్రో రైళ్లు అర్ధరాత్రి వరకు సేవలందించనున్నాయి. డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ సందర్భంగా రాత్రి 12.30 వరకు నడవనున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం అర్ధరాత్రి 12.30కి చివరి రైలు స్టేషన్ నుండి బయలుదేరి 1.15 వరకు డెస్టినేషన్ స్టేషన్లో చేరుకోనున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా అర్ధరాత్రి వేడుకలు ఉండటంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు విస్తృతంగా జరిగే అవకాశం ఉండటంతో సేఫ్ గా ఇంటికి చేరుకునేందుకు మెట్రో ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ క్రమంలో ప్రయాణికులు మెట్రో రైల్‌లో సేవ్ జర్నీ చేయాలని మెట్రో ఎండీ సూచించారు. మెట్రో రైల్ సేవలను ప్రత్యేక అకేషన్ పండుగల టైంలో అర్ధరాత్రి వరకు మెట్రో సేవలను పొడిగిస్తున్నట్టు తెలిపారు. మద్యం తాగి మెట్రోలో తోటి ప్రయాణికులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులంతా బాధ్యతాయుతంగా వ్యవహారించాలని మెట్రో ఎండీ సూచించారు.

## ఏపీకి రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి...

మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకనున్నాయి క్లీన్ ఎనర్జీ పాలసీతో ఏపీకి పలు సంస్థలు క్యూ కడుతన్నాయి. ఎస్ఐపిఎస్ సమావేశంలో పెట్టుబడులకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచమంతా ఇప్పుడు గ్రీన్ ఎనర్జీవైపు పయనిస్తుందని తెలిపారు. ఏపీ ఆ దిశగా ఆలోచనలు చేయాల్సి ఉందన్నారు. యూనిట్ విద్యుత్ ధర రూ.5.18 నుంచి రూ.4.80కు తగ్గించడం లక్ష్యమని చెప్పారు. యూనిట్ విద్యుత్ ధర తగ్గించేందుకు వినూత్న యోచనలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో విద్యుత్ రంగంలో వినూత్న మార్పు చూస్తారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో ప్రజాభిప్రాయానికి తగ్గట్టే పాలన ఉంటుందని తెలిపారు. అధికారులు తమ పనితీరుతో ప్రజలను మెప్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. దీంతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు దేశ, విదేశీ కంపెనీలు సైతం క్యూ కట్టాయి. అందులోభాగంగా ఇప్పటికే పలు కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. అలాగే జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నుంచి లూలు సంస్థ వెళ్లి పోయింది. ఆ సంస్థ సైతం మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం తెలిపింది. ఇవేగాకుండా టాటా సంస్థతోపాటు పలు ప్రముఖ ఐటీ కంపెనీలు కూడా ఏపీలో తన సంస్థలను ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. అయితే వైసీపీ ప్రభుత్వం హయాంలో ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి వచ్చింది లేదు. అలాగే లూలూ సంస్థ కూడా ఏపీ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయింది. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో, ఉపాధి కోసం యువత దేశంలోని వివిధ రాష్ట్రాలకు తరలి వెళ్లారు. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు గ్రహించారు. అందుకే, ఈ ఏడాది మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమలు ఏర్పాటుకు దేశ విదేశీ సంస్థలు క్యూ కడుతున్నాయి.

## సత్య నాదెళ్లను కలిసిన సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి...

తెలుస్తోంది. సత్య నాదెళ్ల హైదరాబాద్‌లో చదువుకుని ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. ఆయన తండ్రి యుగంధర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఆయన కొంత కాలం క్రితం చనిపోయారు. లో ప్రొఫైల్ ఇష్టపడే సత్య నాదెళ్ల ఎక్కువ హంగామా చేయరు. హైదరాబాద్ వచ్చిన విషయం తెలియడంతో ప్రభుత్వ పెద్దలు ఆయనను కలవాలని ఆసక్తి చూపించడంతో అంగీకరించినట్లుగా తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ సీఈవోగా అధికారికంగా పర్యటనలకు గతంలో వచ్చారు. అప్పుడు నేరుగా మైక్రోసాఫ్ట్ ఆర్ అండ్ డీకి వెళ్లి ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించేవారు. హైదరాబాద్ మైక్రోసాఫ్ట్, అమెరికా తర్వాత అతి పెద్ద క్యాంపస్‌ను నిర్మిస్తోంది, డేటా, క్లౌడ్ రంగాల్లో పెట్టుబడులు పెడుతోంది. సత్య నాదెళ్లతో జరిగిన సమావేశానికి పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబుతో పాటు, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెళ్లారు. అలాగే బీఆర్ఎస్ హయాం నుంచి తెలంగాణలో పెట్టుబడులు, ఇతర అంశాల్లో కీలకంగా వ్యవహరించి సీనియర్ అధికారి జయేష్ రంజన్ వెళ్లారు. చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి వెళ్లారు. సాఫ్ట్ వేర్ రంగంలో తెలంగాణలో తాము చేపట్టబోయే ప్రాజెక్టులు, ఏఐ సిటీ నిర్మాణం, ఫోర్త్ సిటీ వంటి వాటిపై ముఖ్యమంత్రి సత్యనాదెళ్లకు వివరించినట్లుగా తెలుస్తోంది. వాటిని సక్సెస్ ఫుల్ చేయడంలో నాదెళ్ల సలహాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తెలంగాణ ఆత్మ బంధువు

మొదటి పేజీ తరువాయి...

పేర్కొన్నారు. 1991-96 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయన ఊపిరి లూదారని సీఎం వివరించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ ఏర్పడిందని. మన్మోహన్ సింగ్ ఎల్‌పీజీ విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపారు. 2004-14 మధ్య ప్రధానిగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధిహామీ, ఆర్టీఐ, ఎన్‌హెచ్‌ఆర్ఎంను ప్రారంభించారు. ఆర్థిక స్థితిగతులు మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారని సీఎం అన్నారు. సామాజిక విప్లవ కార్యక్రమమైన ఆధార్‌ను మన్మోహన్ ప్రారంభించారు. సరళీకృత ఆర్థిక విధానాలు తెచ్చి ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు. ఆయన సేవలు భావితరాలు గుర్తుంచుకోవాలి. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఈ సభ తీర్మానం చేస్తోంది. ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు. ఆయన నీతి, నిజాయతీ, నిబద్ధత కలిగిన నేత. జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి. ప్రధాని సహా అనేక హోదాల్లో ఉన్నా నిరాడంబరంగా జీవించారు. ఉపాధిహామీ పథకాన్ని అనంతపురం, మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం .2013లో భూసేకరణ చట్టం తెచ్చి రైతుకు న్యాయం జరిగేలా చేశారు. 2006లో అటవీ హక్కుల చట్టానికి సవరణలు చేసి ఆదివాసీలను ఆదుకున్నారు. ఐటీ రంగంలో శాసించగలుగు తున్నామంటే మన్మోహన్ విధానాలే కారణం. ఆయన తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ బిల్లులను రెండు సభల్లో పాస్ చేయించిన సారథి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని బలమైన శక్తిగా నిలిపారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసమానతలు, సామాజిక పరిస్థితి అర్థం చేసుకుని చట్టాల ద్వారా ప్రజలకు ధైర్యం నింపారన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని చెప్పారు. పాలనాపరమైన అంశాలను సామాన్యుడూ తెలుసుకునేలా 2005లో ఆర్టీఐ తెచ్చారని గుర్తుచేశారు. ఆయన తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం దేశ గతినే మార్చేసిందని పేర్కొన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని భట్టి విక్రమార్క చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే విప్లవాత్మక భూసేకరణ చట్టం వచ్చిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. దేశ క్షేమం దృష్ట్యా మన్మోహన్ సింగ్ న్యూక్లియర్ ఒప్పందం కుదుర్చు కున్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు. రైతులకు రుణమాఫీ చేసిన తొలి ప్రధాని మన్మోహన్ సింగ్. సోనియా గాంధీ సూచనల మేరకు ఆయన గొప్ప చట్టాలు తెచ్చారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చింది. ప్రభుత్వంలో ఉన్నవారు జవాబుదారీగా ఉండాలని సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారు. ప్రజల సొమ్ముతో చేసిన పనుల వివరాలు తెలుసుకొనే హక్కు దీని ద్వారా లభించింది. ఆకలి చావులు ఉండకూడదని ఆహార భద్రత చట్టం తెచ్చారని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ అనేక గొప్ప విధానాలు తీసుకొచ్చారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేసుకున్నారు. ఆయన సాధారణ స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగారని కొనియాడారు. మన్మోహన్‌ను ఆర్థికమంత్రిగా అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఎంపిక చేశారని గుర్తు చేశారు. గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ తెచ్చారని పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్ పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. సామాన్య ప్రజలకు ఆయుధమైన 'ఆర్టీఐ', ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో 'ఆధార్' తెచ్చారన్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో రాష్ట్రాల్లో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారని వివరించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన క్రియాశీల పాత్ర పోషించారని శ్రీధర్‌బాబు చెప్పారు.

## రాయలసీమకు గేట్ వే కానున్న కానున్న బనకచర్ల

**అమరావతి డిసెంబర్ 30(నిఘా న్యూస్):** గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బనకచర్లకు నీటిని తీసుకెళ్లగలిగితే నదుల అనుసంధానం పూర్తయినట్లేనని, ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రిజర్వాయర్ల అనుసంధానం కూడా పూర్తవుతుందని చెప్పారు. నీటిలభ్యతను బట్టి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్‌కు రోజుకు కనీసం 2 టీఎంసీలు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి 'గేమ్ ఛేంజర్' అవుతుంది. బనకచర్లకు నీటిని తీసుకెళ్లగలిగితే నదుల అనుసంధానం పూర్తయినట్లేనని వివరించారు. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రిజర్వాయర్ల అనుసంధానం కూడా పూర్తవుతుంది. రాష్ట్రంలో అదనపు ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. గోదావరి - బనకచర్ల పూర్తయితే తెలుగుతల్లికి జలహారతి ఇచ్చినట్లే. తెలుగు రాష్ట్రాల్లో 90శాతం ప్రాజెక్టులు తెదేపా హయాంలో చేపట్టినవేనని చంద్రబాబు తెలిపారు. దాదాపు అన్ని ప్రాజెక్టులు తెదేపా అధికారంలో ఉన్నప్పుడే చేపట్టామన్నారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సమక్షంలో తెలుగు గంగ ప్రాజెక్టుపై ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. అప్పట్లో శ్రీశైలం నుంచి కెనాల్ ద్వారా తెలుగుగంగకు నీళ్లు ఇవ్వడానికి ఎన్టీఆర్ సిద్ధమని చెప్పారన్నారు. అలా రాయలసీమకు తెలుగుగంగ నీళ్లు తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు.'వెలిగొండ, తోటపల్లి ప్రాజెక్టులు నేనే ప్రారంభించాను. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీటి కొరత, వర్ష పాతం ఎక్కువ. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కరవు వల్ల సాగు దెబ్బతింటోంది. నీళ్లు ఇవ్వగలిగితే రాయలసీమను రత్నాలసీమగా చేయవచ్చు. గతంలో అనంతపురంలో అతి తక్కువ తలసరి ఆదాయం ఉండేది. ఉద్యాన పంటలతో ఆ జిల్లాలో తలసరి ఆదాయం 4-5 శాతానికి చేరింది. పట్టిసీమ చేపట్టిన తర్వాత సరైన సమయానికి పంటలు చేతికి అందే పరిస్థితి వచ్చింది. కృష్ణాలో నీళ్లు తగ్గాయి. గోదావరిలో నీటి ప్రవాహం ఉంది. కృష్ణా నది నుంచి 2,989 టీఎంసీల వరద ప్రవాహం సముద్రంలోకి వెళ్తోంది. నదుల అనుసంధానంతో కరవు, వరద పరిస్థితులు ఎదుర్కోవచ్చు. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీళ్లు ఇవ్వాల్సి ఉంది. గోదావరి నుంచి కృష్ణాకు కనీసం 200 టీఎంసీలు తీసుకురావాలన్నారు. ఈ ఏడాది 4,114 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి వెళ్లాయి. రాష్ట్రంలో రిజర్వాయర్ల సామర్థ్యం 983 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం రిజర్వాయర్లలో 729 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. జనవరి 1 నాటికి రిజర్వాయర్లలో 74 శాతం నీళ్లు ఉండటం రికార్డు. ఖరీఫ్ పంటలకు ముందస్తుగా నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. వరదలు, తుపానుల కంటే ముందుగా పంట చేతికి వచ్చే వీలుంది' అని చంద్రబాబు తెలిపారు. మూడు దశల్లో బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేపట్టాం. పోలవరం నుంచి కృష్ణా నదికి నీరు మళ్లించడం మొదటి దశ. రెండో దశలో బొల్లాపల్లి జలాశయం నిర్మించి నీళ్లు తరలిస్తాం. మూడోదశలో బొల్లాపల్లి నుంచి బనకచర్లకు నీటిని మళ్లిస్తాం. రాయలసీమకు బనకచర్ల గేట్‌వే కానుంది. ఈ ప్రాజెక్టుతో సీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు లబ్ది చేకూరుతుంది. రూ.80 వేల కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేస్తే రాష్ట్రానికి ఎంతో ఆదాయం వస్తుంది. డబ్బుంటే 3 ఏళ్లలో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేయొచ్చు. ఇది దేశంలోనే అతి పెద్ద సాగునీటి మౌలిక వసతి అవుతుంది. ప్రధాని మోదీకి ఈ ప్రాజెక్టు నివేదిక పంపిస్తున్నాం. ప్రాజెక్టుపై ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రితో మాట్లాడాం. కేంద్రమే ఈ ప్రాజెక్టు వ్యయాన్ని భరించలేదు. హైబ్రిడ్ మోడల్‌లో నిధుల సమీకరణకు ఆలోచిస్తున్నామని అన్నారు. గోదావరి-బనకచర్లతో 80 లక్షల మందికి తాగునీరు అందుతుంది. 7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు వస్తుంది. ఈ ప్రాజెక్టు నిర్మించేందుకు 48 వేల ఎకరాల భూసేకరణ అవసరం. ఇది చరిత్రను తిరగరాయబోయే ప్రాజెక్టు. చాలా సీరియస్‌గా తీసుకున్నాం. గోదావరి-బనకచర్లతో భావితరాలకు నీటి సమస్య ఉండదు. ఈ ప్రాజెక్టుపై ప్రజల్లో కూడా చర్చ జరగాలి. ప్రైవేటు సంస్థలు చేపడితే ప్రభుత్వం చెల్లింపులు చేసే విధానాన్ని రాజస్థాన్‌లో అమలు చేశారు. రోడ్ల మాదిరిగా ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ ప్రైవేటు సంస్థలు చేపట్టాలి. వయబిలిటీ గ్యాప్ ఫండ్ వరకు ప్రభుత్వం ఇస్తుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ పూర్తి చేసి 2-3 నెలల్లో టెండర్లు పిలుస్తాం అన్నారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ వైపు ప్రయాణిస్తోంది. మనమూ ఆ దిశగా ప్రయాణం చేయాల్సి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి క్రెడిబులిటీ లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఐదేళ్లలో ఏం జరిగింది. ఇప్పుడు ఏం జరిగింది అని ప్రజలు చూస్తున్నారన్నారు. జగన్ ఎప్పుడు ఏం చేస్తారనేది అతనికే తెలియదని ఎద్దేవా చేశారు. క్రెడిబిలిటీ లేని నాయకులు, హిడెన్ ఏజెండాతో మాట్లాడతారని సెటైర్లు గుప్పించారు. వాస్తవాలు లేకుండా జగన్ మాట్లాడతారని మండిపడ్డారు. అబద్దాలతో రాజకీయం చేశారని.. ఇప్పుడు అలాకాదని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మీడియా, ఫైనాన్స్, వ్యవస్థలు, వ్యక్తులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. వాటర్ సెక్యూరిటీకి ఎంతో ప్రాధాన్యం ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. గండికోట, సోమశిల విస్తరణ, కండలేరు వంటి ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్లామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 7 మండలాలు తెలంగాణలో ఉన్న వాటిని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చెప్పి వాటిని ఏపీలో విలీనం చేశామని గుర్తుచేశారు. రాయలసీమకు నీరు వస్తే డెల్టాతో పోటీపడుతుంది. కృష్ణానదిలో పై నుంచి నీరురావడం లేదు, పట్టిసీమ వచ్చాక సరైన సమయంలో పంట వేయగలుగుతున్నాం. గోదావరి, కృష్ణాలో నీళ్లుతగ్గినా గోదావరిలో నీరు వస్తోంది. రాష్ట్రంలో కరవును సమర్థంగా ఎదుర్కొంటే తప్ప అభివృద్ధి సాధ్యం కాదన్నారు. సమర్థంగా నదులు అనుసంధానం చేసి రిజర్వాయర్‌లు కట్టుకుంటే నీటి సమస్య పరిష్కారమవుతుంది. ఏపీకి కరవు, తుఫాను వల్ల ఇబ్బందులు ఉన్నాయి. వంశధార-నాగావళి- గోదావరి-కృష్ణ వరకూ కలిపే అవకాశం ఉంటుంది. తుంగభద్ర- శ్రీశైలం - నాగార్జునసాగర్ - ప్రకాశం బ్యారేజి, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ వస్తే నాగార్జున సాగర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి అవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు.

## కాశ్మీర్‌ను కప్పేసిన మంచు దుప్పటి

**శ్రీనగర్ డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** కాశ్మీర్‌లో హిమపాతం కారణంగా భారీగా మంచు కురుస్తోంది. దీంతో అక్కడి ప్రభుత్వం పరీక్షలను రద్దు చేసింది. డిసెంబర్ 30న జరగాల్సిన కాశ్మీర్ యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా పడ్డాయి. కాశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో విపరీతమైన మంచు కురుస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మజిద్ జమాన్ తెలిపారు. పరీక్షలను సకాలంలో నిర్వహిస్తామన్నారు. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలు విడిగా జారీ చేయబడతాయన్నారు. కొత్త సంవత్సరానికి ముందు జమ్మూ కశ్మీర్‌లో మంచు భారీగా కురుస్తోంది. ఈ ప్రభావం జనవరి 1, 2 తేదీల్లో కూడా ఉంటుందని, కొన్ని కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వెదర్ రిపోర్ట్ అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత జనవరి 3, 6 తేదీల మధ్య కశ్మీర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో భారీ హిమపాతం ఉండవచ్చని వెల్లడిరచారు. దీంతో జమ్మూ డివిజన్‌లోని అనేక ప్రాంతాలు కూడా ప్రభావితం కానున్నాయి. వాతావరణం అధ్వాన్నంగా ఉన్న నేపథ్యంలో ఆదివారం అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హిమపాతం కురిసింది. ఆ క్రమంలో మంచు తొలగింపు తర్వాత రెండో రోజు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. దీంతోపాటు దారిలో నిలిచిన వాహనాలను గమ్యస్థానం వైపు పంపించారు. బనిహాల్, ఖాజిగుండ్ మధ్య రోడ్లు జారడం కారణంగా, డ్రైవర్లు నెమ్మదిగా నడపాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇదే సమయంలో సింథాన్ రోడ్, సోన్‌మార్గ్-కార్గిల్ రోడ్, భదేర్వా-చంబా రోడ్‌తో పాటు జిల్లా రాజోరి, పూంచ్ నుంచి షోపియాన్ (కశ్మీర్) వరకు కలిపే మొఘల్ రోడ్‌లు ఇంకా మంచుతోనే ఉన్నాయి. వీటిని ఇంకా తెరువలేదు. వాతావరణం మెరుగుపడిన తరువాత శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు పునఃప్రారంభించ బడ్డాయి. పర్యాటకులు, ప్రయాణికులు ట్రాఫిక్ విభాగం సలహా ప్రకారం ప్రయాణించాలని సూచించారు. అలాగే నేటి నుంచి రైలు సర్వీసులను పునరుద్ధరించారు. అయితే సోమవారం విస్టాడోమ్ సేవలు రద్దు చేయబడ్డాయి. ఈ క్రమంలో లోయలోని చాలా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 నుంచి 6 డిగ్రీలు తక్కువగా ఉంది.

## గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చారు

మొదటి పేజీ తరువాయి...

ఉండాల్సింది. పోనీ, సీట్లో ఆయన కూర్చొన్నాక అయినా, చెప్పి తీసుకెళ్లాల్సిందని అన్నారు. అల్లు అర్జున్ తరపున ఎవరో ఒకరు బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉంటే బాగుండేది. ఈ ఘటనలో రేవతి చనిపోవడం నన్ను కలచి వేసింది. గోటితో పోయేదాన్ని గొడ్డలివరకూ తెచ్చారు. మేమంతా అండగా ఉన్నామని ముందే చెప్పి ఉండాల్సింది. తమ ప్రమేయం లేకుండా తప్పు జరిగి పోయిందని విచారం వ్యక్తం చేయాల్సింది. ఈ విషయంలో ఎక్కడో మానవతా దృక్పథం లోపించింది. అందరూ రేవతి ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చి ఉండాల్సింది. పరామర్శించకపోవడం వల్లే ప్రజల్లో ఆగ్రహం వచ్చింది. తన వల్లే ఒకరు చనిపోయారనే వేదన అర్జున్‌లో ఉంది' 'సినిమా అంటే టీమ్ అందరి భాగస్వామ్యం. అల్లు అర్జున్ ఒక్కడినే దోషిగా మార్చడం కూడా కరెక్ట్‌కాదు. తొక్కిసలాట ఘటన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలపై సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి స్పందించారు. చిరంజీవి కూడా గతం లో అభిమానులతో కలిసి సినిమాలు చూసేందుకు వెళ్లేవారు. కాకపోతే ఆయన ముసుగు వేసుకుని ఒక్కరే థియేటర్‌కు వెళ్లే వారు. పరిశ్రమలోని వారందరూ కూర్చొని మాట్లాడాలి. రాష్ట్రంలో పాపికొండలు వంటి చక్కటి లొకేషన్లు ఉన్నాయి. విజయనగరం అటవీ ప్రాంతంలోనూ అందమైన ప్రదేశాలు న్నాయి. ఈ ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు అవసరం. ఇండస్ట్రీలో క్వాలిటీ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఉండాలి. స్టోరీ టెల్లింగ్ స్కూల్స్ రావాలి. అప్పుడే మంచి సినిమాలు సాధ్యం' అని పవన్ కళ్యాణ్ అన్నారు.

## ఢిల్లీలో పీవీకి గుర్తింపు దక్కాలి

**హైదరాబాద్ డిసెంబర్ 30(నిఘా న్యూస్):** మన్మోహన్ సింగ్ గొప్పతనం, సామర్థ్యం, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన వ్యక్తి తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదని చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ ఏర్పడిరదని తెలిపారు. కేంద్రంలో ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలని మన్మోహన్ సింగ్‌ను కేసీఆర్ కోరారని గుర్తుచేశారు. మన్మోహన్‌కు నివాళి కోసం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'దివంగత మాజీ ప్రధాని మాన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి బీఆర్ఎస్ తరఫున పూర్తిగా మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నామని అన్నారు. మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని మొదటిసారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహా రావు అనేది నిర్వివాదాంశం. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత రాజకీయాలతో సంబంధ లేని ఒక ఆర్థిక వేత్తను ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారు. 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ 'ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది. నా దేశం మేల్కొని ఉంది..' అంటూ ఆర్థిక వేత్తగా సంస్కరణలను ప్రవేశపెట్టే సందర్భంగా మాట్లాడారు. ఆ మాటలు ఆయన సిద్ధాంతం, పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కేవలం 15 రోజులు ఫారెక్స్ నిల్వలు ఉన్న నాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శీలి డాక్టర్ మన్మోహన్ సింగ్. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా సింపుల్ లివింగ్.. హై థింకింగ్ అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్ సింగ్‌ను మనం చెప్పుకోవచ్చు. విశ్వాసం అనే నేటి రాజకీయాల్లో అరుదైన పదం. తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన మహానుభావుడు. ఆర్థికమంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేసి, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన అభ్యుదయ వాది, నిరాడంబర మనిషి మన్మోహన్ సింగ్ అని అన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్. ఏడాదిన్నరపాటు కేంద్ర మంత్రిగా పనిచేశారు. నాటి కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని గెలుపొందిన తర్వాత భాగస్వామ్య పక్షాలను మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇస్తే, డీఎంకేతో చిక్కుముడి ఏర్పడిరది. దీంతో మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లి తాను వచ్చింది పదవుల కోసమో, పోర్టు ఫోలియోల కోసమో కాదు. తెలంగాణ కోసమని చెప్పిన కేసీఆర్. ఆ మంత్రిత్వ శాఖను డీఎంకేకి ఇచ్చారు. ఈ సందర్భంగా ఏ నిబద్ధతతో వచ్చారో అది ఫలించాలని కోరుకుంటున్నానని కేసీఆర్‌తో మన్మోహన్ అన్నారు. మీరు తీసుకున్న నిర్ణయంతో గుర్తింపు వస్తుందని, కర్మయోగిగా గుర్తించబడతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తర్వాత, ఒక గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదు. అలాగే మన్మోహన్ సింగ్ నమ్మారు కాబట్టే తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి. అన్నీ ఆయనకు అర్థమయ్యాయి కాబట్టే అనివార్య పరిస్థితుల్లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడింది.

## పేర్ని నాని భార్యకు ముందస్తు బెయిల్

మొదటి పేజీ తరువాయి...

భార్య జయసుధ మచిలీపట్నం కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా, గత వారం విచారణ ముగించిన జిల్లా కోర్టు, విచారణను వాయిదా వేసిన విషయం విదితమే. అయితే, బియ్యం మాయం కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది కోర్టు. ఈ కేసులో విచారణకు సహకరించాలని జయసుధకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఏ2 మేనేజర్ మానస తేజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయమైన వ్యవహారంలో జయసుధకు మరోసారి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మొదట 185 మెట్రిక్ టన్నుల బియ్యం మాయం అయ్యాయంటూ రూ.1.68 కోట్ల జరిమానా విధించగా, ఆ తర్వాత మరిన్ని బస్తాల బియ్యం మాయమైనట్టు గుర్తించారు. మొత్తంగా గోడౌన్ నుంచి 378 మెట్రిక్ టన్నుల బియ్యం మాయం అయ్యాయని చెబుతున్న అధికారులు. అయితే, ఈ కేసు వెలుగు చూసిన తర్వాత మాజీ మంత్రి పేర్నినాని కుటుంబం మొత్తం అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం విదితమే. వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన గోదాములో బియ్యం మాయం కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఆదివారం గోదాము మేనేజర్ మానస తేజను, సోమవారం కృష్ణా జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కోటి రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో కోటి రెడ్డికి ప్రమేయముందని పోలీసులు అనుమానిస్తున్నారు. పేర్ని నాని గోదాములో రేషన్ బియ్యం మాయమయ్యాయని కోటి రెడ్డి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బియ్యం నిల్వల మాయం అంశంలో తనపై అనుమానం రాకుండా పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు.

## ఏపీ నూతన సీఎస్‌గా విజయానంద్

**అమరావతి డిసెంబర్ 30(నిఘా న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ నియమితులయ్యారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన విజయానంద్‌ను సీఎస్‌గా నియమిస్తూ ఆదివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విజయానంద్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ డిసెంబర్ 31తో పదవీవిరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో కొత్త సీఎస్‌గా విజయానంద్ బాధ్యతలు చేపడతారు. బీసీ అధికారి విజయానంద్‌కు సీఎస్‌గా అవకాశం ఇవ్వడంతో టీడీపీ నేతలతో పాటు ప్రభుత్వ వర్గాల్లో పెద్ద చర్చ నడుస్తోంది. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన బీసీ అధికారికి సీఎం చంద్రబాబు టాప్ పోస్ట్ ఇచ్చారని పలువురు టీడీపీ నేతలు, ప్రభుత్వ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. చంద్రబాబు నాయకత్వంలో బీసీ నేతలకు, అధికారులకు ఎప్పుడూ సమున్నత గౌరవం దక్కుతుందని అధికారులు అంటున్నారు. ఉమ్మడి ఏపీలో గానీ, నవ్యాంధ్రలో గానీ ఇప్పటి వరకు బీసీలకు సీఎస్ పోస్టు దక్కలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. తొలిసారి బీసీ అధికారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన సీఎంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. బీసీలకు నారా చంద్రబాబు ఎప్పుడూ పెద్దపీట వేస్తారని నేతలు, అధికారులు అంటున్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన టీటీడీ ఈవోగా బీసీ అధికారిగా శ్యామల రావు నియామకం జరిగిందంటున్నారు. అటు ప్రభుత్వంలోను, పార్టీలోనూ బీసీలకు చంద్రబాబు సముచిత స్థానం ఇచ్చారని నేతలు చర్చించుకుంటున్నారు. తెలుగు దేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా బీసీ నేత పల్లా శ్రీనివాస్‌కు అవకాశం ఇచ్చారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. శాసన సభ స్పీకర్‌గా మరో సీనియర్ నేత చింతకాలయ అయ్యన్న పాత్రుడుకు అవకాశం వచ్చిందంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో సీఎస్, డీజీపీ సహా అన్ని కీలక స్థానాల్లో తన సామాజిక వర్గానికి చెందిన వాళ్లనే వైఎస్ జగన్ నియమించారని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.

## విమానయానాలకు చీకటి నెల డిసెంబర్

మొదటి పేజీ తరువాయి...

జరిగిన విమాన ప్రమాదాలు విమానయాన భద్రతపై పలు ప్రశ్నల్ని లేవనెతుతున్నాయి. దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దాదాపు 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండిరగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపోవడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు. డిసెంబర్ 25న అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి బయల్దేరిన విమానాన్ని పొగమంచు కారణంగా కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయానికి మరలించారు. విమానం దానికి దగ్గర్లో ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షి ఢీకొనడంతో కుప్ప కూలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విమానంలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్‌గిస్థానీ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. 27 మంది గాయపడ్డారు.

### డిసెంబర్ 22న మూడు ప్రమాదాలు.. 19 మంది మృతి

డిసెంబర్ 22న బ్రెజిల్‌లో సంభవించిన విమాన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ ప్రయాణికులతో వెళుతున్న ఓ బుల్లి విమానం ఆదివారం దక్షిణ బ్రెజిల్ టూరిస్ట్ సిటీ గ్రామాడోలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో విమానంలో పది మంది ఉండగ, వారంతా ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ పండుగకు కొద్ది రోజుల ముందు ఈ ఘటన జరిగింది. అందరూ పండుగ కోసం ముస్తాబవుతున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం స్థానికుల్లో విషాదాన్ని నింపింది. ఇక అదే రోజు టర్కీలో కూడా ఇలాంటి ప్రమాదమే సంభవించింది. వైద్యులతో బయల్దేరిన అంబులెన్స్ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. రోగిని తీసుకొచ్చేందుకు టేకాఫ్ అయిన హెలికాప్టర్ హాస్పిటల్ భవనాన్ని ఢీకొట్టి, కుప్పకూలింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు, ఒక డాక్టర్, ఒక ఆరోగ్య సంరక్షకుడు చనిపోయారు. టర్కీ ఆగ్నేయప్రాంతంలోని ముగ్లా నగరంలో డిసెంబర్ 22 ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. డిసెంబర్ 22న పాపువా న్యూ గునియాలో నార్త్ కోస్ట్ ఏవియేషన్ నిర్వహిస్తున్న చిన్న విమానం కూలి అందులో ఉన్న ఐదు మంది ప్రాణాలు కోల్పోయారు.

## నాచారం గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**నాచారం, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** సుమారు 54 లక్షల రూపాయల వ్యయంతో నాచారం ఓల్డ్ విలేజ్ లో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జరుగుతున్న పనులను కార్పొరేటర్ శాంతి పర్యవేక్షించడం జరిగింది. రోడ్డు నాణ్యతలో లోపాలుంటే సహించేది లేదని కార్పొరేటర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా నాచారం ఓల్డ్ విలేజ్ గ్రామస్తులు కార్పోరేటర్ ను శాలువాతో సత్కరించారు. సుమారు 30 సంవత్సరాల క్రితం జరిగిన అభివృద్ధి తర్వాత మళ్లీ నాచారం డివిజన్ లో కార్పొరేటర్ శాంతి ఆధ్వర్యంలో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేయడం జరిగిందని మంచినీటి సమస్యలు పరిష్కరించారు. నేటితో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం అవ్వడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్.నాయకులు సాయిజెన్ శేఖర్ భూపాల్ రెడ్డి సాయిబాబా ప్రేమ్ కుమార్ సత్తయ్య, యాదగిరి, జగత్ భరత్ ప్రశాంత్, శ్యామ్, సాయి, నరేందర్, సన్నీ, శ్రీనివాస్ కృష్ణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 31ని శాంతియుతంగా జరుపుకోవాలని

### మద్యం సేవించి పట్టుబడితే కేసు నమోదు చేస్తాం.

### లోకేశ్వరం ఎస్సై.జి.అశోక్



**లోకేశ్వరం, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై.జి.అశోక్ అన్నారు. నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు శాంతియుత వాతా వరణంలో జరుపుకోవాలని సోమవారం ఒక ప్రక టనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరా దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. తాగి వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పోలీసు నిబంధనలు ఉల్లఘించరాదని ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు.

## సాంఘిక శాస్త్రం టాలెంట్ టెస్ట్ విజేతలకు ప్రశంసా పత్రాలు



**తూప్రాన్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూప్రాన్ బాయ్స్ లో మండల సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించినారు, ఇందులో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలకు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్ మీడియం సంబంధించిన విద్యార్థులు పరీక్షలు రాయడం జరిగింది, ఇందులో ఇంగ్లీష్ మీడియం పి.వైశాలి తెలంగాణ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హై స్కూల్, తూప్రాన్ గర్ల్స్ మొదటి బహుమతి, ఎన్.దశరథ్ తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్ తూప్రాన్ రెండవ బహుమతి, కె.అక్షయ్ తూప్రాన్ బాయ్స్ తృతీయ బహుమతులు సాధించారు. తెలుగు మీడియానికి సంబంధించి డి.విశాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకటాయపల్లి మొదటి బహుమతి, ఎస్.అమూల్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బ్రాహ్మణపల్లి రెండో బహుమతి, జి. వినయ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇస్లాంపూర్ మూడో బహుమతులు గెలుపొందగా బహుమతులను ప్రధానం చేశారు. ఇందులో జిల్లా సాంఘిక ఫోరం అధ్యక్షులు ఎస్.ప్రభాకర్, సిద్ధిరాములు, విజయ, సుభాష్ రెడ్డి, చంద్రం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న వదన, ఇతరులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వారు జనవరి 4న మెదక్ లో జరిగే జిల్లా సాంఘిక టాలెంట్ టెస్ట్ లో పాల్గొనడానికి అర్హత సాధించారు.

## ఆర్యవైశ్యుల అమావాస్య అన్నదానం



**తూప్రాన్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద కౌన్సిలర్ కోడిప్యాక నారాయణ గుప్తా, తల్లిదండ్రులు కొడిప్యాక రాజమణి లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం కావడంతో ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ఆధ్వర్యంలో మహాన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ఈ మహాన్నదాన కార్యక్రమంలో కులాలకతీతంగా రాజకీయాల కతీతంగా పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింలు గుప్తా రాజు గుప్తా, బి. శ్రీనివాస్ గుప్తా, శ్రీను గుప్తా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై నిషేధం



**విశాఖపట్నం, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** విశాఖ వాసులకు అలర్ట్ జీవీఎంసీ పరిధిలో జనవరి 1 నుంచి సింగల్ యూజ్ ప్లాస్టిక్ పై నిషేధం అమలులోకి రానుంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై నిబంధనలు కఠినంగా అమలు చేయాలని మేయర్ కమిషనర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. వీటిని వాడే వారిపై జరిమానా వేయడంపైసమాలోచనలుచేస్తున్నారు.ప్రజలకు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంపై అవగాహన కల్పించాలని అధికారులు భావిస్తున్నారు.

# అన్నా క్యాంటీన్ లో ఉచిత భోజనం

**జగ్గంపేట, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** స్థానిక కాకినాడ రోడ్డు లోపల ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ నేతృత్వంలో ప్రతి సోమవారం అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేసి దాతల సహకారంతో పేదలకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. సోమవారం గోకవరం గ్రామానికి చెందిన గోకవరం మాజీ సొసైటీ అధ్యక్షులు గాజింగం సత్తిబాబు వల్లి దేవి దంపతుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ కు వారి కుమారుడు డాక్టర్ గాజింగం సాయి హాజరై పేదలకు ఉచిత భోజనం అందించారు. ఈ సందర్భంగా ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అన్నా క్యాంటీన్ లో ఐదు రూపాయలకే భోజనం అందించేదని గత వైసిపి ప్రభుత్వం రద్దు చేస్తే మళ్లీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసిందని జగ్గంపేటలో ప్రభుత్వం అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసే వరకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల ఉచితంగా భోజనం అందిస్తున్నారని ఈవారం గా జింగం సత్తిబాబు వల్లిదేవి దంపతుల ఆర్థిక సహాయంతో ఈ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం,



కొత్త కొండబాబు, కాకినాడ జిల్లా భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, తంటికొండ దేవస్థానం మాజీ చైర్మన్ పెద్దాడ వెంకన్న దొర, కర్రి శివ, వేములకొండ జోగారావు, దాపర్తి సీతారామయ్య, యల్లమిల్లి సీఎం, దేగల సత్తిబాబు, కంటే ఉదయ భాస్కర్ చౌదరి, సాంబత్తుల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి యుండాలి

- **డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్**
- **ప్రభుత్వ పథకాలను**
- **దళితులు సద్వినియోగం చేసుకొండి: తహసిల్దార్**



**హసన్‌పర్తి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** మనిషిని మనిషిగా చూడ నిరాకరించిన ఈ కుల వ్యవస్థలో రాజ్యాంగం దళితులను, గిరిజనులను ఇతర కులాలతో సమానంగా జీవింపజేసిందని, ప్రతి నెల నిర్వహించే పౌర హక్కుల దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించి, కులాల మధ్య అసమానతలను తొలగించే విధంగా కులాలకతీంగా భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపోందించు కోవాలని, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తు దారుడికి ఇందిరమ్మ ఇండ్లను ఎటువంటి ఆంక్షలు లేకుండా మంజూరి చేయాలని డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చుంచు రాజేందర్ కోరారు. సోమవారం మడిపల్లి గ్రామంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫజీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ దళితులు తమ సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కారానికి మార్గం చూపుతామన్నారు. గ్రామంలో బాల కార్మికులు,వెట్టి చాకిరి ఉందా అని, దళిత వాడలలో కరెంటు, మంచినీటి, డ్రైనేజి సమస్య ఉన్నదా అని అదే విధంగా జోగిని, భానమతి గురించి సమావేశంలో అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలనలో ప్రభుత్వ పథకాల కొసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికి పథకాలను అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఫజల్, గ్రామ మాజీ సర్పంచులు కాందారి బాగ్యలక్ష్మి కృష్ణ మూర్తి, చిర్ర సుమలత విజయ్ కుమార్, దళిత వాధి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సందెల రవిందర్, డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, ఉప సర్పంచ్ బుర్ర రంజీత్, వార్డ్ సభ్యులు చిట్యాల బాలరాజు,బాల చందర్,రాజు,కిరణ్, పరుశరాములు, తదితరులు పాల్గొన్నారు.

# అభిరుచి అవకాశం కల్పిస్తే ప్రతి ఒక్కరూ రాణిస్తారు



- **పాత పాటలలో సాహిత్యం ఎంతో ఉంటుంది**
- **నూతన సంవత్సర వేడుకలలో జస్టిస్ శేష శయనా రెడ్డి**

**రవీంద్ర, భారతి డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** నూతన సంవత్సర వేడుకలు రెండు రోజుల ముందుగానే ప్రారంభం అయ్యాయని, పాత సంవత్సరంలో చేసిన పనులను ఒకసారి అవగతం చేసుకోవాలని,జీవితం లోంచి ఒక సంవత్సరం వెళ్లి పోయిందని, భారతీయ సంస్కృతి ఆత్మానందాన్ని కలిగిస్తాయని జస్టిస్ శేష శయన రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్, నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కూచిపూడి నృత్య ప్రదర్శన, హాస్య వల్లరి,పాటల కార్యక్రమం రవీంద్రభారతిలో జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ శేష శయన రెడ్డి హాజరై కళాకారులను సత్కరించి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ అవకాశం,అభిరుచి కల్పిస్తే ప్రతి ఒక్కరూ తమ తమ కళలలో రాణిస్తారని, తల్లిదండ్రుల ప్రోత్సాహం అందుకు ప్రధాన కారణమై, పిల్లలు నృత్య సంగీత,సాహిత్యాలలో సాధికారతను సాధిస్తారని, తద్వారా మన సంస్కృతి వెల్లి విరుస్తుందని అన్నారు. ప్రముఖ నాట్య గురువు అంజు బాబు మాట్లాడుతూ మహతి,కీర్తనల నాట్యం అద్భుతంగా ఉందని ,గాయని గాయకులు కల్యాణి, శేఖర్, దివాకర్ పాత పాటలతో మనసుకు ఆహ్లాదాన్ని కలిగించారని ఇటువంటి మంచి కార్యక్రమము నిర్విహించిన సంస్థ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి కి అభినందనలు తేలియచేశారు. అభినందన భవాని మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు అద్భుతంగా నిర్వహించారని,కీర్తన నృత్య ప్రదర్శన చాలా అద్భుతంగా ఉందని, మోహన్ కృష్ణ హాస్యవల్లరి కడుపుబ్బా నవ్వించిందని, ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని,కళలను ముందు తరాల వారికి అందచేయాలని అన్నారు. న్యాయవాది విజయ కుమార్ మాట్లాడుతూ తనకు చిన్నతనం నుండి కళలంటే ఎంతో ఇష్టమని,ఇప్పటి పాటలలో ఎటువంటి సాహిత్యము లేదని, పాత పాటలే ఎప్పటికి అజరామరం అని అంటూ కీర్తన నర్తించిన రామాయణ నృత్యం ఎంతో అద్భుతంగా ఉందని అభినందించారు. మోహన కృష్ణ, మూర్తి, రమణ, వేణు గీతికల హాస్య వల్లరితో మనసుకు ఆహ్లాదాన్ని కలిగించారని, హాస్యమే నేటీ జీవన స్రవంతిలో పరమ ఔషధమని వక్తలు కొనియాడారు. ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పాలపర్తి సంధ్యారాణి తెలంగాణ, కళలకు ప్రోత్సాహాన్ని ఇస్తున్న భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేత



**ముస్తాబాద్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైసమ్మ యూత్ సభ్యులు సీసీ కెమెరాలను అందించారు. సెలవులు వస్తే చాలు పాఠశాల ఆవరణలో రాత్రి పూట జరుగుతున్న దొంగతనాలు, పాఠశాలకు సంబంధించిన వస్తువులు ధ్వంసం చేయడం, మద్యం సేవించడం లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న సంధర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురభి రాధా కిషన్ రావు అభ్యర్థన మేరకు పోతుగల్ గ్రామంలోని మైసమ్మ యూత్ దాదాపు 20 వేల రూపాయల విలువైన సీసీ కెమెరాలు పాఠశాలకు వితరణ చేయడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణన్ రావు పేర్కొన్నారు. సోమవారం సీసీ కెమెరాలు పాఠశాలలో ఇన్స్టాలేషన్ చేయడం జరిగిందని పాఠశాలలో పాఠశాల ఆవరణలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు చోటు ఇవ్వకుండా భద్రత ఏర్పాట్లు చేసుకోవడం జరిగిందన్నారు. మైసమ్మ యూత్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోల క్రిష్ణ, కిట్టు,వరి వెంకటేష్,రాకేష్, గణేష్, సాయి, ప్రశాంత్, సందేశ్, సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. సీసీ కెమెరాలు పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# కూచిపూడి సెంటర్ లో వామపక్షాల నిరసన



**కూచిపూడి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** భారత పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో రాజ్యసభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు పట్ల క్షమాపణ చెప్పాలని, కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని రాష్ట్రంలో వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా మొవ్వ మండలం కూచిపూడి సెంటర్లో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, మొవ్వ మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు, మండల కమిటీ సభ్యులు ఉప్పాలపు వెంకటాద్రి, కాకి రాజశేఖర్, బొల్లా సుబ్రహ్మణ్యం, పార్టీ సీనియర్ నాయకులు మద్దుల బసవరావ్, పామర్తి కోటేశ్వరరావు, చిగురుపల్లి సుబ్రమణ్యం, వెంకటేశ్వరరావు, పామర్తి సుబ్బారావు, బిల్డింగ్ కార్మికుడు దుర్గారావు, సిపిఐ మండల నాయకులు కెవి అప్పారావు, నరసింహారాజు, నాగేశ్వరరావు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన మల్లవరం నీటి సంఘం నేతలు



**గోకవరం, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం మల్లవరం బోపాల్ రాజ్ చెరువు నీటి సంఘం అధ్యక్షులుగా సత్యం శ్యాంసుందర్ ఎన్నికయ్యారు. సోమవారం చెరువు నీటి సంఘం కమిటీ అంతా కలిసి జగ్గంపేట శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుమల తిరుపతి పాలకవర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. రైతులకు సకాలంలో నీరు అందే విధంగా పనిచేసే పేరు తెచ్చుకోవాలని నెహ్రూ కోరారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘ ఉపాధ్యక్షులు గంటా వీరబాబు సభ్యులు కరణం గోవింద్ ఆది వీరబాబు బుదిరెడ్డి వెంకటస్వామి పడాల కాట్రాజు, తెలుగుదేశం పార్టీ ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ యిడుదల అర్జునరావు, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొర్రెపల్లి శ్రీను ఉపసర్పంచ్ లంక శ్రీను, టిడిపి యువ నాయకులు సత్యం రాజా మాజీ ఎంపీటీసీ సిరందాసు రాజు, జనసేన పార్టీ అధ్యక్షులు జీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య భక్తులకు ప్రసాదం పంపిణీ

### శ్రీ కృష్ణ చారిటబుల్ ట్రస్ట్



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణ చాటబల్ టెస్ట్ వ్యవస్థాపకులు మల్లెంబాకం ముని కృష్ణారెడ్డి మాట్లాడుతూ పూర్వజన్మ సుకృతం ఉండి శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మనం శివయ్య పాదాల చెంత జన్మించామని అటువంటి పుణ్యక్షేత్రంలో శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయటం తద్వారా ప్రతి ఒక్కరు భగవద్గీత చదవాలని సదుద్దేశంతో భగవద్గీత అమూల్యమైన గ్రంథాలను ఉచితంగా భక్తులకు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేయటం ఆనందంగా ఉందని, శ్రీకృష్ణ చారిబుల్ ట్రస్ట్ సభ్యుల సహాయ సహకారాలు ఎంతో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జ్ఞానమ్మ వారి మధు రెడ్డి మాజీ బోర్డు నెంబర్లు సున్నపు లక్ష్మీపతి రెడ్డి అత్యంజేరి బాలాజీ వన్నె కుల క్షత్రియ నాయకులు చింతకాయల సుధాకర్ రెడ్డి జగదీష్ రెడ్డి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## పని ముట్ల కోసం మున్సిపల్ కార్మికుల నిరసన

### ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్




**శ్రీకాకుళం, డిసెంబరు 30 (నిఘా న్యూస్):** ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులకు సకాలంలో పనిముట్లు ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు డిమాండ్ చేసిన మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు,నగరపాలక సంస్థ పరిదిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు కు సకాలంలో పనిముట్లు ఇవ్వాలని,పారలు,బుట్టలు, చిపురులు, భద్రత పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ప్రమాద భీమా పాలసీలు అమలు చెయ్యాలని పి.ఎఫ్,ఈఎస్ఐలో ఉన్న సాంకేతిక లోపాలు సరి చెయ్యాలని,ఐ.డి కార్డులు మంజూరు చేయాలని,నగర విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి పని భారం తంగించాలని వినూత్నంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు కె.వేణుగోపాల్ రావు,నాయకులుజె.గురుమూర్తి,ముద్దాడరామారావు, ఎన్.పార్థ సారథి, ఆర్.గణేష్, డి.రమణ అర్జీ.గణేష్, సోగ్గాడు సీతమ్మ, రసూల్ సోషల్‌మీడియా ప్రతినిధి అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



**ముస్తాబాద్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల గోపా ఆధ్వర్యంలో గూడెం, నామపూర్ పాఠశాలలలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమానికి గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్, మండల అధ్యక్షుడు కదిరే పరశు రామ్ గౌడ్, ఉపాధ్యక్షులు దేవరాజ్ గౌడ్ అక్కపెల్లి లక్ష్మీపతి గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాగా చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అలాగే విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కరాచారి, హనుమంత్ రెడ్డి, రాజన్న సుధాకర్ భాగ్యలక్ష్మి, మంగ, గూడెం ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కళాకారులకు ప్రశంసా పత్రాలు



**వలిగొండ, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** వలిగొండ మండల కేంద్రంలో సోమవారం జిల్లాలో ఉద్యమకారులకు ప్రశంస పత్రాలు అందజేయాలనే నిర్ణయం ప్రకారం గంధమల్ల బాలయ్య అధ్యక్షతన, జోగు అంజన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జి, గంధమల్ల మల్లమ్మ ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, ఉద్యమకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శీలం స్వామి రాష్ట్ర కో కన్వీనర్, బత్తిని రవీందర్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి, కదిరేణి స్వామి జిల్లా కార్యవర్గ సభ్యులు, మల్లం వెంకటేశం జిల్లా సాంస్కృతిక కార్యదర్శుల సమక్షంలో అంద చేయడం జరిగింది. ప్రశంసా పత్రాలు అందుకున్న ఉద్యమ కళాకారులు, ఉద్యమ కారిణులు, ఎదురు గట్ల పెద్ద యాదగిరి, చిన్న యాదగిరి, లక్ష్మయ్య, సందయ్య, భాస్కర్ సామల యాదమ్మ, శీలం ఇందిర, గొల్లపెల్లి అంజమ్మ, బత్తుల మంగమ్మ, ఎం.డి.అబ్బాస్ తదితరులు అందుకున్నారు.

## గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులుగా వెంకటేష్ గౌడ్



**మల్కాజిగిరి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** గౌడ ఐక్య సాధన సమితి మల్కాజి గిరి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులుగా మల్కాజిగిరి వినాయక నగర్‌కు చెందిన పల్లె వెంకటేశం గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ అబిడ్స్ లోని గౌడ సంఘంలో నియామక పత్రాన్ని అందుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బత్తిని మురహరి గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ జివాజి అంజయ్య గౌడ్,రాష్ట్ర అధికార ప్రతినిధులు బూడిద నర్సయ్య గౌడ్,బబ్బురి రాజేష్ గౌడ్, బండి బుచ్చయ్య, బూడిద కాంం గౌడ్ తదితరులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## చివరి ఆయకట్టు వరకు నీరు ఇవ్వండి

### మానేరులో నిండా నీరున్నా అధికారుల నిర్లక్ష్యం తగదు



**ముస్తాబాద్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల తహసిల్దార్ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకుడు శీలం స్వామి రైతులతో కలిసి మండల రెవెన్యూ అధికారి సురేష్ కు వినతి పత్రం అందజేశారు. పుష్కలంగా కాలమై మానేరు డ్యాములో నిండా నీరు ఉందని కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు రైతులకు నీరు ఇవ్వాలని కోరుతూ ఇవ్వకుంటే రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ముస్తాబాద్ నుండి ప్రారంభమవుతుందని రైతుల పక్షాన ప్రభుత్వాన్ని కోరినట్లు స్వామి పేర్కొన్నారు.

## మన్మోహన్ సింగ్ కు మేయర్ నివాళులు



**బోడుప్పల్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ ను స్మరించుకుంటూ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో భారత ఆర్థిక వ్యవస్థ నూతన దశకు చేరుకున్న విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు దేశానికి అభివృద్ధి, స్థిరత్వాన్ని తీసుకువచ్చాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠధామంలో విద్యుత్ దీపాల ఏర్పాటు



**మేడ్చల్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ మారేపల్లి రాజకుమారి అన్నారు. మున్సిపాలిటీ పరిధి 7వ వార్డు బాసు రాగడి గ్రామంలోని వైకుంఠధామంలో విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం సహకారం అందించాలని మెడినోవా ఆసుపత్రి చైర్మన్ సింగిరెడ్డి వెంకటరెడ్డిని వార్డు కౌన్సిలర్ కోరగా కౌన్సిలర్ అభ్యర్థన మేరకు స్పందించిన సింగిరెడ్డి వెంకటరెడ్డి లక్ష 50వేలతో విద్యుత్ దీపాలకు సంబంధించినటువంటి కేబుల్ వైర్లను కొనుగోలు చేసి అందజేశారు. మరిన్ని మున్సిపల్ నిధులతో వైకుంఠధామంలో సోమవారం విద్యుత్ దీపాల ఏర్పాటు చేయించామని కౌన్సిలర్ రాజకుమారి తెలిపారు. ఆర్థిక సహకారం అందించిన దాత


# కుబీర్ మార్కెట్ కమిటీ దళిత చైర్మన్ పదవిని భర్తీ చేయాలి



**లోకేశ్వరం, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** కుబీర్ కేంద్రంలోని కుబీర్ మార్కెట్ యార్డ్ ముందు. దళితులకు వచ్చినటువంటి రిజర్వేషన్ ప్రకారం మార్కెట్ కమిటీ చైర్మన్ ను ప్రభుత్వాలు భర్తీ చేయలేకపోతున్నాయి. అందుగాను కుబీర్ మార్కెట్ యార్డ్ గేట్ ముందర దళిత సంఘాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకటించే వరకు. అమర నిరాహార దీక్ష ప్రారంభించారు. వెంబడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ప్రకటించకపోతే పెద్ద ఎత్తున రాస్తారోకోలు ధర్నాలు నిర్వహించి ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని కొత్తూరు శంకర్ పిలుపు ఇవ్వడం జరిగింది. బిజెపి మండల అధ్యక్షుడు ఏషాల దత్తు మాట్లాడుతూ దళితులకు న్యాయపరంగా రావాల్సినటువంటి మార్కెట్ కమిటీ చైర్మన్ ను అడ్డుకోవడం స్థానిక నాయకులకు సిగ్గుచేటని మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకటించక పోతే బిజెపి తరఫున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రకటించారు. బిఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు పెంట వారి దశరథ్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకటించక పోతే ఆమరణ దీక్షను ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుబీర్ మాజీ సర్పంచ్ బాబు అన్నబావుసాటే తనూర్ మండల అధ్యక్షుడు సురేష్ వాడ్ సాహెబ్ రావు అదేవిధంగా అన్నబహు సాటే కుబీర్ మండల అధ్యక్షుడు జీవన్ టిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ కుబీర్ మండల అధ్యక్షుడు నాగేష్ పార్టీ మాజీ ఎంపీటీసీ కానోబా గులాబ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అమలుకు నోచుకోని వన్ వే నిబంధన

### రాంగ్ రూట్లో వాహనాల రాకపోకలు నిత్యం రోడ్డు ప్రమాదాలు




**అంబర్ పేట, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** రాంగ్ రూట్లో వాహనాల రాకపోకలను నియంత్రించడంలో అంబర్ పేట ట్రాఫిక్ పోలీసులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. అంబర్ పేట ఫ్లైఓవర్, మూసారాంబాగ్ నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు, జరుగుతుండడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వన్ వే నిబంధనను విధించారు. ప్రధానంగా అలీ కేఫ్ మూసా బ్రిడ్జి, గోల్నాక చౌరస్తా కాచిగూడ కమేలా మార్గాలలో వన్ వే నిబంధన కొనసాగుతుంది. అయితే ఈ మార్గాలలో వన్ వే ఉన్నప్పటికీ కొంతమంది వాహనదారులు రాంగ్ రూట్లో వెళ్తున్నారు. ఈ క్రమంలో అలీ కేఫ్, గోల్నాక వద్ద ప్రతినిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూ పలువురు గాయాల పాలవుతున్నారు.వన్ వే లో వాహనాల రాకపోకలను ఒకవైపు నియంత్రించాల్సిన అంబర్ పేట ట్రాఫిక్ పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో నిలబడి రాంగ్ రూట్లో వెళ్లే వారిని ఫోటోలు తీయడంలో ఆసక్తి చూపుతున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు, వన్ వేలో ఒకవైపు వాహనాల రాకపోకలను కట్టడి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వన్ వే మార్గాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారులు వన్ వే నిబంధనను వాహనదారులు ఖచ్చితంగా పాటించే దిశగా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఎస్.హెచ్.ఓ, సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం.

# కష్టజీవులకు అండగా సీపీఐ నిరంతర పోరాటాలు

### సీపీఐ జిల్లా నాయకులు బలగ శ్రీరామ్మూర్తి




**శ్రీకాకుళం, డిసెంబరు 30 (నిఘా న్యూస్):** కార్మికులు, రైతులు, కష్టజీవులకు అండగా భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా నిరంతరం పోరాటాలు చేస్తుందని సీపీఐ జిల్లా నాయకులు బలగ శ్రీరామ్మూర్తి అన్నారు.సీపీఐ శత జయంతి వేడుకలు సందర్భంగా శ్రీకాకుళం జిల్లా మండల కేంద్రమైన నరసన్నపేటలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు బ్రిటీష్ పాలనలో కట్టుబానిసలుగా ఉన్న సమయంలో 1925 డిసెంబరు 25న కాన్పూర్ లో అభ్యుదయ శక్తులు కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి నాంది పలికారని తెలిపారు. దేశ రాజకీయాల్లో,జాతీయోద్యమ ప్రస్థానంలో సీపీఐ ది చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, బానిసత్వం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సుధీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన విప్లవ శంఖారావం అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యు.సి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖ రావు,దాసరి సూర్యనారాయణ,పోతల అప్పన్న, నిమ్మాడ శివరాం, లక్ష్మణ తదితరులు పాల్గొనగా నిమ్మాడ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగింది.

# భారత్ ను హిందూ దేశంగా మార్చాలని కుట్ర

### పలాసలో వామపక్ష నేతల నిరసన




**శ్రీకాకుళం/పలాస, డిసెంబరు 30 (నిఘా న్యూస్):** భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ పార్లమెంట్ వేదికగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండించాలని పలాసలో వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామడ. సన్యాసిరావు, సిపిఐ కార్యదర్శి చాపర. వేణుగోపాల్, సిపిఎం నాయకులు ఎన్.గణపతి, న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి మాట్లాడుతూ పార్లమెంట్ వేదిక అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కేంద్ర మంత్రి పదవి నుండి అమిత్ షాని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మూడోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగాన్ని మార్చాలని, మనుస్మృతి ని తీసుకురావాలని, లౌకిక ప్రజాస్వామ్యక విలువల్ని కూలదోసి ఈ దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలని కుట్ర చేస్తుందని అన్నారు. తక్షణమే అమిత్ షా రాజీనామా చేయకుంటే, మోడీ ప్రభుత్వం అమిత్ షా పై చర్యలు తీసుకోకుంటే దేశ వ్యాప్తంగా వామపక్షాలు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.యస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రవి, పి వై ఎల్ జిల్లా కన్వీనర్ సారా జగన్, రైతు కూలీ సంఘం నాయకులు మధ్యలో రామారావు, పోతనపల్లి కామేశ్వరరావు, వంకల పాపయ్య,మామిడి భీమారావు, జడ్డే అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో పట్టభద్రుల గొంతుకను అవుతాను

### వేములవాడలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం



**వేములవాడ, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** వేములవాడ రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యరంగ సమస్యలపై అవగాహన ఉన్న తనను భారీ మెజారిటీ తో గెలిపించాలని అల్ఫోర్స్ విద్య సంస్థల చైర్మన్ డా. వి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం వేములవాడ పట్టణంలో పలువురు పట్టభద్రులను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తాను కట్టుబడి ఉంటానని అన్నారు. ఉద్యోగ, నిరుద్యోగ, పట్టభద్రుల సమస్యల పై అవగాహన ఉన్న తనను ఆశీర్వదించి అవకాశం ఇస్తే చట్టసభల్లో పట్టభద్రుల గొంతుక వినిపిస్తానని స్పష్టం చేశారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని. విద్యా రంగం నుండి తాను ఎమ్మెల్సీ గా బరిలోకి దిగుతున్నాని, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతానని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా లైబ్రరీ లలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతి, యువకులకు వివిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఉచిత స్టడీ మెటీరియల్ ను అందజేస్తున్నామని వెల్లడించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పరిధిలోని నాలుగు ఉమ్మడి జిల్లాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని రెండు నెలల తన పర్యటనలో పలు గ్రంథాలయాలను సందర్శించి, తన వంతుగా చాలాచోట్ల మౌళిక సదుపాయాలు కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తున్నారని వెల్లడించారు. దూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రంలోని లైబ్రరీ లకు వచ్చి చదివుకునే నిరుద్యోగుల కోసం చాలా చోట్ల తన సొంత డబ్బులతో మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించినట్టు వెల్లడించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు వీఎన్ఆర్ ఈ క్లాసెస్ ద్వారా ఉచితంగా అందజేసే స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# నారాయణపేట పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డీఎస్పీ



**నారాయణపేట, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** పోలీసులు విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు మరింత చేరువ అయ్యేలా, ప్రజల మన్ననలు పొందే విధంగా పోలీస్ విధులు నిర్వర్తించాలని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. మొదటగా పోలీస్ సిబ్బంది పరేడ్ ను పరిశీలించారు. అందరూ పరేడ్ పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్ ని పరిశీలించారు. ఉద్యోగం చెరే సమయంలో ఇచ్చిన కిట్ ఆర్టికల్స్ అన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమన్నా సమస్యలు ఉంటే ఎస్పీ దృష్టిలో ఉంచి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు ప్రజా సమస్యలపై వచ్చే బాధితులకు భరోసా కల్పించాలని వారి ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ సత్వర న్యాయం అందే విధంగా భరోసా కల్పించాలని కోరారు.

## హైదరాబాద్ లో రేపటి సభకు సిద్ధమవుతున్న ఆశా వర్కర్లు



**లోకేశ్వరం, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** మండలానికి చెందిన ఆశ వర్కర్లు తమ సమస్యలపై పోరాటానికి అనుమతి కోరుతూ మండల మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు అనుబంధ ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఇతర న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. డిసెంబర్ 15న ప్రారంభమైన బస్సు యాత్రలో భాగంగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆశ వర్కర్ల సమస్యలను ప్రజలకు తెలియజేస్తూ, డిసెంబర్ 31న హైదరాబాద్‌లో నిర్వహించేముగింపు కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశ వర్కర్లను పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేస్తూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ముఖ్యమైన ఉద్దేశమని ఆశ వర్కర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో. నంద,స్వప్న, కళ్యాణి,సబిత, రాజేశ్వరి,సవిత, తదితరులు ఉన్నారు.

## సెట్విన్ సెంటర్ ప్రారంభోత్సవ పోస్టర్ విడుదల

### సెట్విన్ సెంటర్ తో ఉపాధి అవకాశాలు

### బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్



**బోడుప్పల్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెట్విన్ సెంటర్ తో అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం సెట్విన్ సెంటర్ ప్రారంభోత్సవం సంబంధించిన పోస్టర్ ను డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి గౌడ్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గానూ సెట్విన్ లో అవసరమైన కోర్సులు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## వీరాంజనేయ స్వామి దేవస్థానం హుండి లెక్కింపు



**మేడిపల్లి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం ప్రారంభించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ చైర్మన్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగినది. హుండీ లెక్కింపగా రూ.1,63,637 రావడం జరిగింది. మార్చి-24 లో హుండీ లెక్కింపు ద్వారా వచ్చిన ఆదాయం రూ.70,632. గతంతో పోల్చుకుంటే ఈ సారి హుండీ ఆదాయం రెండింతలు ఎక్కువ రావడం జరిగింది.

## విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**మేడిపల్లి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** మేడిపల్లి విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణ సంఘం సమాజ అభివృద్ధికి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. నూతన క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా విశ్వ బ్రాహ్మణ సంఘాల ఆచారాలు, సంస్కృతిని కొత్త తరాలకు పరిచయం చేయడం అనేది ఒక గొప్ప ప్రయత్నమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి వీరాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ జంగాచారి, విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు, మేడిపల్లి మండల వివిధ కుల సంఘాల నాయకులు, పలు కాలనీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని గౌరవించని బిజెపి నేతలు



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ను 7వ వార్డు ఇంచార్జ్, బిఎంసి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాద్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి సాయి మారుతి నగర్, కేశవ నగర్ ఐమాక్స్ లైట్లు, విద్యుత్ పోల్స్, విద్యుత్ దీపాలు, వివిధ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. మేయర్ వెంటనే స్పందించి విద్యుత్ అధికారులతో చర్చించడం జరిగింది. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

*-బోడుప్పల్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):*

## మంచి నీటి సరఫరా లో పాలు సరిచేయండి

### జలమండలి అధికారులతో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్



**మల్కాజిగిరి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధి తిరుమలనగర్, జవహర్ నగర్ ఏరియాలలో మంజీరా నీరు ప్రెషర్ తక్కువగా రావడంతో కాలనీవాసులు కార్పొరేటర్ కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించి సోమవారం కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ జలమండలి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. చర్యలు తీసుకోవాలని జలమండలి జిఎం సునీల్ కుమార్, డీజీఎం అక్షిత మేనేజర్ నవీన్ లను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బాబు కిషోర్, నారాయణ తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## మాల మహానాడు తాండూరు అధ్యక్షులుగా కృష్ణ కుమార్



**తాండూరు, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మాల సంఘం జే.ఏ.సీ.చైర్మన్ చెరుకు రామచందర్ ఆధ్వర్యంలో తాండూరు నియోజకవర్గ మాల మహానాడు కమిటీ అధ్యక్షులుగా బి.కృష్ణ కుమార్, ఉపాధ్యక్షులుగా బి.శేఖర్, ఎం.రాములు ప్రధాన కార్యదర్శిగా ఏం.గోవింద్, కే.నర్సింలు, కార్యదర్శులుగా లాలప్ప, రాములు, సురేష్, విష్ణు, కోశాధికారిగా నర్సింలు, సలహాదారులుగా మల్లప్ప మాల మహానాడు నూతన కమిటీగా ఎన్నికయ్యారు.

## విద్యార్థులతో కలిసి తహసీల్దార్ మధ్యాహ్నం భోజనం



**వలిగొండ, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వం అందించే మేను ప్రకారం సరిగా నడుస్తున్నదా లేదా సుచీ శుభ్రతను పరిశీలించి విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన మండల తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించవలసిన భోజనాన్ని పరిశుభ్రతతో విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం అందిస్తున్న మేను ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వందేళ్లుగా జనం గుండెల్లో మహోన్నత స్థానం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మందడపు రాణి



**మధిర, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** బ్రిటిష్ పాలకుల కబంద హస్తాల్లో మగ్గుతున్న భారత దేశానికి విముక్తి కలిగించేందుకు ఆవిర్భవించిన సిపిఐ నాటి నుంచి నేటి వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతోందని, నూరేళ్ళ పార్టీగా జనం గుండెల్లో సిపిఐ మహెూన్నత స్తానం సంపాదించుకుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మందడపు రాణి. సోమవారం సిపిఐ శతవార్షి కోత్సవాలను పురస్కరించుకొని నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సిపిఐ భారీ బహిరంగ సభకు మధిర నుంచి సిపిఐ శ్రేణులు వెళుతున్న సందర్భంగా రాణి మాట్లాడారు.స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న సిపిఐని మొగ్గలోనే తుంచివేయాలని అనేక కుట్రలు పన్నినా ప్రజాబలంతో కుట్రలను ఎదురించి నాటి నుంచి నేటివరకు అజేయంగా నిలిచిందని అన్నారు. కూడు, నీడ లేని పేదల అభ్యున్నతికి, కార్మికులు, కర్షకుల హక్కులకోసం, ప్రజాస్వామ్య రక్షణకోసం, అనేక ఉద్యమాలు నిర్మించిన ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. వందేళ్లుగా సిపిఐ నిర్వహించిన ప్రజా పోరాటాలు భావితరాలకు స్ఫూర్తి అని,మరో వందేళ్లైనా సిపిఐ ప్రజలపక్షం వీడబోమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రహీం, సిపిఐ మండల నాయకులు అన్నవరపు సత్యనారాయణ, జల్లా బ్రహ్మం, ధర్మ తేజ ఉన్నారు.

### మోడీ క్షమాపణ చెప్పాలని వామపక్ష నాయకుల డిమాండ్

**మల్కాజిగిరి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** రాజ్యాంగ పదవిలో ఉండి నిండు సభలో రాజ్యాంగ నిర్మాతను అవమానించి అమిత్ షా రాజీనామ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. గత పార్లమెంటు సమావేశాల సందర్బంగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ ప్రతిపక్షాలు అంబేద్కర్ ను అదేపనిగా తలవడం కంటే, భగవంతుణ్ణి తలచు కుంటే పుణ్యం, స్వర్గం దొరుకుతుందని మాట్లాడారు. ఆయన మాటలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమర్ధించారు. భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ అంబేద్కర్ ను అమిత్ షా అవమాన పరిచి యావత్ భారత పౌరుల మనో భావాలను కించపరిచారని బీజేపీ నాయకుల తీరుకు వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా నిరసనలు జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం సిపిఎం పార్టీ మల్కాజిగిరి మండలకమిటీ ఆధ్వర్యంలో ఆనంద్ భాగ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి సిపిఎం, సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాలను తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన కేంద్ర మంత్రి అమిత్ షా దేవుళ్ళు, దయ్యాలు అని ప్రసంగించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఇది సెక్యులర్ భావాలకు, లౌకిక వాదానికి పూర్తి విరుద్ధం అంటూ విమర్శించారు. అమిత్ షా వెంటనే రాజీనామా



చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు నారాయణ్ రెడ్డి మాట్లాడుతూ అమిత్ షా ను సస్పెండ్ చేయాల్సింది పోయి సమర్ధించడం సిగ్గుచేటని ప్రశ్నించారు. ఒక వైపు మణిపూర్ లో మంటలు రగులుతున్నా మోడీ అక్కడికి వెళ్లే ప్రయత్నం చేయడు వాళ్ళ సమస్య పరిష్కారంచడు. ఇటువంటివారికి పాలించే హక్కు ఉన్నదా అని ప్రశ్నించారు. ఒకేదేశం ఒకే ఎన్నిక చట్టం తేవడానికి పార్లమెంటులో చర్చ జరిగితే ప్రతి పక్షాలు, ఇండియా కూటమి తీవ్రంగా వ్యతికించింది. ఈ చర్చను పక్కదారి పట్టించేందుకు అమిత్ షా అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశారని దేశంలో ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేక భారత పౌరులను పచ్చి మోసం చేసిందని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కృపా సాగర్ బిజెపి ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు చేశారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని అమిత్ షా రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ మాట్లాడుతూ నిండు సభలో అబేద్కర్ ను అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గతంలో ఈ విధంగా ఏ ప్రభుత్వంలో జరగలేదు. బిజెపి నేతలు దేశ సమైక్యత సమగ్రతలకు భంగం కలిగించటం సిగ్గు చేటు అన్నారు. సిపిఐ నాయకులు నాగరాజు కేద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే వామ పక్ష పార్టీలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. సీనియర్ సీపీఐ నాయకులు కమలాకర్ మాట్లాడుతూ ఓటు ద్వారా ఎన్నికైన అమిత్ షా పదవులు అనుభవిస్తూ సిగ్గు ఎగ్గు లేకుండా మాట్లాడటంపై అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేని మోడీకి పాలించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత అదని, అంబానీల కోసమే పనిచేస్తున్నారని, ప్రభుత్వ సంస్థలన్నీ అమ్మేస్తున్నాడని దేశా నికి ఆర్థిక నష్టం కలిగిస్తున్నదని మండల నాయకులు శ్రీనివాస్, విజయ్ కుమార్ బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకురాలు మంగ, నాగమణి పాల్గొని మోడీ విధానాలను వ్యతిరేకించారు. అన్నపూర్ణమ్మ, రాజ్యలక్ష్మి రాజు వామపక్ష పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాన్యువల్ స్కావెంజర్ వ్యవస్థకు స్వస్తి పలకాలి

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** మాన్యువల్ స్కావెంజర్స్ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ఆ వ్యవస్థకు స్వస్తి పలకాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాన్యువల్ స్కావెంజర్స్ వ్యవస్థ నిర్మూలనపై మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులతో జిల్లా విజిలెన్స్ కమిటీ (మాన్యువల్ స్కావెంజర్స్ చట్టం 2013) సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో మాన్యువల్ స్కావెంజర్స్ గా ఉండేవారిని వెంటనే గుర్తించాలని, వారి సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీలలో సఫాయి కర్మచారులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిబంధనల ప్రకారం వారికి మాస్క్, గ్లౌజులు, షూలు, ఆయిల్, సోప్, హెల్మెట్, సేఫ్టీ ప్యాక్,ఫస్ట్ ఎయిడ్ బాక్స్, తదితర రకాల భద్రతా పరికరాలు,




ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు వివిధ పథకాల కింద అర్హత కలిగిన వారికి రుణాలు ఇచ్చేందుకు మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. ఈ సమావేశంలో నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, సోషల్ వెల్ఫేర్ డిడి విశ్వమోహన్ రెడ్డి, డిపిఓ భారతి సౌజన్య,శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయి ప్రత్యూష,కృష్ణ మూర్తి, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, సభ్యులు ఎన్.బలరాం తి.తిరుపతి రావు,వేణు గోపాల్ అప్పలరాజు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వంశరాజుల సంక్షేమానికి కృషి

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**రామంతపూర్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** వంశారాజుల సంక్షేమానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. రామంతపూర్ వంశరాజుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మానం, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వంశ రాజులు ఆర్థికంగా, రాజకీయపరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వరరావు, వంశరాజుల సంఘం రాష్ట్ర నాయకులు పాయసం గోపాల్ బాలు అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వీరాస్వామి, బాల చందర్, ఆంజనేయులు శ్రీనివాస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ ప్రజావాణికి 123 ఫిర్యాదులు





### సత్వర పరిష్కారానికి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశాలు

**మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల సమస్యల అర్జీలను ఇంఛార్జి డిఆర్ఓ శంకర్ కుమార్ తో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 123 ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### మీర్పేట్ ఎస్ హెచ్ ఓ నాగరాజు



**బాలాపూర్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** మద్యం సేవించి రోడ్లపై వాహనాలను నడుపరాదని, స్టేషన్ పరిధిలో పలుచోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, పట్టుబడితే చట్టరీత్య చర్యలు ఉంటాయని మీర్పేట్ ఇన్స్పెక్టర్ కె.నాగరాజు తెలిపారు. ప్రజలందరికీ ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజలు కొత్త సంవత్సరాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని కాలనీలలో తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం అర్థరాత్రి ఒంటిగంట వరకు దుకాణాలు, రెస్టారెంట్లకు అనుమతి ఉందని, ఆ తర్వాత నిర్వాహకులు మూసివేయాలని అన్నారు. రోడ్లపై వాహనాలను నిలిపి శుభాకాంక్షలు తెలుపుకోవడం, కేక్స్ కటింగులు చేసుకోవడం చేయకూడదని, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, తోటి పౌరులకు అసౌకర్యం కలిగించకుండా శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.

## నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్ లీజు రద్దు చేయాలి



- అధికారులకి ప్రయాణికులు ముఖ్యమా
- ప్రైవేట్ వ్యక్తులు లాభాలు ముఖ్యమా
- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్

**శ్రీకాకుళం, డిసెంబరు 30 (నిఘా న్యూస్):** శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం నివగాం గ్రామ పంచాయతీ కేంద్రంలో ప్రజలు, ప్రయాణికులు సౌకర్యార్థం 1995 సంవత్సరంలో నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్ ను 10 ఏళ్ళు ప్రైవేటు వ్యక్తులకు అధికారులు లీజు మంజూరు చేయటం అన్యాయమని ఏ.పి.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్,శ్రీకాకుళం జిల్లా ఆర్టీసీ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా - ఒరిస్సా రాష్ట్రాలకు సరిహద్దు గ్రామంలో ప్రజలకు, ప్రయాణికులుకు విలువ నీడ లేకుండా చేయటం దుర్మార్గమని, కొత్తూరు నుండి పలాస,పలాస నుండి మాతల ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారని, ప్రైవేటు బస్సులు,ఒడిస్సా ఆర్టీసీ బస్సులు వస్తుంటాయని, ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు వేచి ఉండేవారని తెలిపారు. ప్రభుత్వ ఆర్టీసీ కాంప్లెక్స్ ను, శ్రీకాకుళం జిల్లా ఆర్టీసీ అధికారులు పదేళ్లు లీజుకు ఇవ్వడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆర్టీసీ కాంప్లెంక్స్ ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలని,నివగాం పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉపయోగపడే కాంప్లెక్స్ ను స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ప్రజలు, ప్రయాణికులు సౌకర్యార్థం అధికారులు ఇచ్చిన లీజు రద్దు చేసి.నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్ ను అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలు మద్దతుతో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలవెల్లి రాంబాబు, పూర్ణచంద్ర పట్నాయక్, బి.చిన్నారావు, బూరాడ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ అధికారులకు సమాజంలో గుర్తింపు

### మల్కాజిగిరి సర్కిల్ డిఏఈ సత్యనారాయణ పదవీ విరమణ

### మల్కాజిగిరి జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రాజు



**మల్కాజ్గిరి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** మల్కాజిగిరి సర్కిల్ డిఏఈ సత్యనారాయణ పదవి విరమణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ రాజు అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ లో డివిజనల్ అకౌంట్ సెక్షన్ ఆఫీసర్ గా పని చేసిన సత్యనారాయణ పదవి విరమణ కార్యక్రమం లక్ష్మీ సాయి గార్డెన్ లో కాంట్రాక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతోమంది ఆఫీసర్స్ ఉంటారని అందులో కొంతమందికే గుర్తింపు లభిస్తుంది అన్నారు. ప్రజలకు జవాబు దారితనంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో అంకితభావంతో పని చేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం సత్యనారాయణ దంపతులకు, సర్కిల్ కు చెందిన వివిధ సెక్షన్ల అధికారులు, కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

# రేపు రాత్రి 12:30 గంటల లోపు వేడుకలు ముగించాలి

### ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి


### యాదాద్రి జిల్లా డీసీపీ రాజేష్ చంద్ర

**వలిగొండ, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు జాగ్రత్తలు పాటించాలి, వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు. జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్త్ తో పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు,రాజేష్ చంద్ర డీసీపీ ఐపీఎస్ యాదాద్రి భువనగిరి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారు జాగ్రత్తలు పాటించాలి, ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలు జరుపుకోవాలి, పోలీసు వారి సూచనలు పాటించాలని జిల్లా డీసీపీ రాజేష్ చంద్ర ఐపీఎస్ ప్రజలకు సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరిగినది అని తెలిపారు.డిసెంబర్ 31 రాత్రి వేడుకలు, నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం ముఖ్యంగా పటిష్ఠమైన బందోబస్త్, నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోను డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయన్నారు. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర



వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.పోలీసుల సూచనలు నిబంధనలు,నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు రాత్రి 12:30 గంటల వరకు పూర్తి కావాలి.తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం,పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలి,మైనర్స్ కు వాహనాలు ఇవ్వవద్దు,టపాసులు, డీజే లు నిషేధం మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు వేగంగా నడపవద్దు,రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు చేయవద్దు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించవద్దు, ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు,ఇల్లు, ప్రవేట్ ఆస్తులపై, వీధి దీపాల పై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం నేరం, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం న్యూ ఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మకూడదు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతాం. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు.ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఎర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలి.న్యూ ఇయర్ అఫర్ ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నది కావున ఆన్లైన్ నందు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నెంబర్స్ ఇవ్వవద్దు.అంక్షలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించు కోవాలని యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర కోరారు.

## హాస్టల్ విద్యార్థినిలకు ఆరోగ్య పరీక్షలు




**వలిగొండ, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు స్థానిక తహసిల్దార్ పి శ్రీనివాస్ రెడ్డి సోమవారం మండల పరిధిలోని లోతుకుంట మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ విద్యార్థినిలకు వేములకొండ ఆరోగ్య కేంద్రం వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం వల్ల వారి ఆరోగ్య పరిస్థితులని తెలుసుకొని తగు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

## ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



**అనపర్తి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం అనపర్తి మండలం రామవరం గ్రామంలో అనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 2025వ సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎస్ టి యు సేవా కార్యక్రమాలు అభినందనీయం అని ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం సంఘం చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు పుట్టా గంగాధర చౌదరి, పడాల వెంకటరామారెడ్డి ఎస్ టి యు రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ మెంబర్ తమలంపూడి ఈశ్వర్ రెడ్డి, ఎస్ టి యు రాష్ట్ర నాయకులు వెలగల బామిరెడ్డి, ఎస్ టి యు బిక్కవోలు మండల శాఖ ప్రధాన కార్యదర్శి ద్వారంపూడి సురేందర్ రెడ్డి ఎస్ టి యు నాయకులు టి.సూరిబాబు పడాల సత్యనారాయణ రెడ్డి లచ్చిరెడ్డి సత్యనారాయణ గొలుగురి శ్రీనివాస్ రెడ్డి సబేళ్ళ శ్రీనివాస్ రెడ్డి సీరం అప్పారావు పాల్గొన్నారు.

## పిఎం సూర్య ఘర్ యోజన ద్వారా ప్రయోజనాలు

### విద్యుత్ కాంట్రాక్టర్ల తో మాట్లాడుతున్న ఈ.ఈ.విన్నకోటి చంద్ర శేఖర్ రావు



**తిరుపతి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** ప్రతి ఒక్కరూ ఇంటి పై సోలార్ టాప్ ను నిర్వహించుకుని విద్యుత్ బిల్లులను అధా చేసుకోండి అని ఏపి.ఎస్పీ.డి. సియల్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ,ఈ.విన్నకోటి చంద్ర శేఖర్ రావు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం టౌన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ల సమావేశం లో విద్యుత్ వినియోగదారులు ప్రతి ఇంటి పై సోలార్ టాప్ ను నిర్వహించుకుని విద్యుత్ బిల్లులను అధా చేసుకోండి. ఈ సమావేశంలో తిరుపతి టౌన్ డివిజన్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ.విన్న కోటి చంద్ర శేఖర్ రావ్ తో పాటు ఏడి.లు, ఏ.ఈ.లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నరు.

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి అవుట్ సోర్సింగ్ కార్మికుల వినతి పత్రం



**జగిత్యాల, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసం ఇందిరా భవన్ లో తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులు వేతబత్యం పెరుగుదల ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. సంబంధిత శాఖ.

# పద్మశాలీల వైకుంఠ ధామానికి స్థల సేకరణ



### స్మశాన స్థలం కేటాయింపుకు సహకారం: కార్పొరేటర్ బన్నాల

**చిలుకానగర్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్ లోని భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు సకినాల ప్రసాద్, బెజగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కి డివిజన్ లోని పద్మశాలి సంఘానికి వైకుంఠ ధామం కొరకు స్థల సేకరణ విషయంలో పూర్తి సహకారం ఉండాలని కోరుతూ వినతిపత్రం అందజేయడం జరిగింది. అనంతరం పద్మశాలి సంఘం సభ్యులు కార్పొరేటర్ గీత మాట్లాడుతూ పద్మశాలి సంఘానికి సంబంధించిన 674 కుటుంబాలకి వైకుంఠధామం లేదని వైకుంఠ దామం కోసం స్థల సేకరణ విషయంలో వారి పూర్తి మద్దతు పద్మశాలి సంఘానికి ఉంటుందని వివరించారు. చిల్కానగర్ డివిజన్ ప్రజల ఆశీస్సులతో డివిజన్ కార్పొరేటర్ గా అవకాశం కల్పించిన ప్రతి ఒక్క కుల సంఘం వారికి వైకుంఠధామాల కోసం ఎన్నికలలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, నిధులు కేటాయించి అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. డివిజన్లోని భక్త మార్కండేయ పద్మశాలి సంఘం కొరకు వైకుంఠధామం స్థల సేకరణ విషయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి వీలైనంత త్వరలో వైకుంఠధామానికి ప్రభుత్వ స్థల కేటాయింపు విషయంలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కోకుండా జగన్, బింగి శ్రీనివాస్, చిల్కానగర్ డివిజన్ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు నాగార్జున, దాసరి శ్రీనివాస్, దేవసాని బాలచందర్, సామల నాగరాజు నర్సింగ్ రావు, అంజయ్య, రమేష్, పాముల ఆంజనేయులు, చందు, కృష్ణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, పాముల బాలకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# షాపులను తొలగించొద్దని చిరు వ్యాపారుల వినతి పత్రం

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్, రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబందించిన సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు తమ జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న వ్యాపార షాపులను తొలగించొద్దని సోమవారం గాజులరామారం సర్కిల్ మున్సిపల్ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబంధించిన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ కుటుంబాల నిరుపేదలు రాజీవ్ గృహకల్ప స్థలం సర్వేనెంబర్ 348/1 లో వార్డ్ కార్యాలయం పక్కన, మసీదుకు ఎదురుగా గల స్థలంలో తమ జీవనోపాధి కోసం చిన్న చిన్న వ్యాపార షాపులను (డబ్బాలు) ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నా మన్నారు. కాని ప్రస్తుతం జిహెచ్ఎంసి అధికారులు తమ షాపులను తొలగించి ప్రహరీ గోడ నిర్మించే ప్రయత్నం చేస్తున్నందున అట్టి పనులను వెంటనే నిలిపివేసి అట్టి స్థలాలను తమకే చెందేవిదంగా కేటాయించి తమ చిరు వ్యాపారాలను యెధావిధిగా కొనసాగించుకుని తమ జీవనాన్ని కొనసాగించుకునే విధంగా మునిసిపల్ అధికారులు సహకరించాలని,



లేదంటే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుందని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. అందుకు మున్సిపల్ అధికారులు సానుకూలంగా స్పందించి తప్పకుండా చిరువ్యాపారులకు న్యాయం జరిగేవిదంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జికే నాయకులు, సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు గార్లపాటి ప్రభాకర్, ధర్మారపు అంజయ్య, చిరువ్యాపారులు భాన్స్వాడ వెంకటేష్, నాగభూషణం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహ మూర్తి

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డి.ఎస్.పి నరసింహమూర్తి తెలియజేశారు. సోమవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ డిసెంబరు 31న శ్రీకాళహస్తి పట్టణము, రూరల్, తొట్టంబేడు పరిసరాల ప్రాంతాల్లో లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకార్యలు కలగకుండా పోలీసుశాఖ ముందస్తు చర్యలు చేపడుతుందని తెలిపారు. శ్రీకాళహస్తి పరిధిలోని పోలీసులతోపాటు ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, షీటీం, పెట్రోలింగ్ విభాగాలకుచెందిన పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆంక్షలు పెడుతున్నట్లు వెల్లడించారు. వేడుకలు అందరికీ ఆమోద యోగ్యంగా, ఆహ్లాదకరంగా ఆరోగ్యంగా, హాని రహితంగా ఉండాలని కోరారు.ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా నిబంధనలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలో రాత్రి 10 గంటలోపు అని దుకాణాలను మూసేయాలన్నారు. ముఖ్యంగా యువత బైక్ రైసింగ్ లకు పాల్పడడం,



మద్యం తాగి వాహనాలు నడిపిన అల్లర్లకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసేసి, అధిక శబ్దాలతో హోరెత్తించినా విన్యాసాలు చేసిన చట్ట పరంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ఇబ్బందులు కలిగిస్తే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను వినియోగిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించినా, చట్టం ఉల్లంఘించినా వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సిఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### నిధుల దుర్వినియోగం..

# తప్పుడు పత్రాలు జారీ చేసిన అధికారుల సస్పెన్షన్

- ఎమ్మెల్యే ఫిర్యాదుతో కదలిన డొంగ
- విధుల్లో నిర్లక్ష్య వైఖరిని ఉపేక్షించడం జరుగదు
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



**కోరుకొండ, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన, నిధులను దుర్వినియోగం చేసిన వారి విషయంలో ఉపేక్షించె పరిస్థితి ఉండదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీల పరిధిలో శానిటేషన్ నిర్వహణ, విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవరించడం, పన్నుల వసూళ్ల పరంగా పనితీరు నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ తదితర అంశాల ఆధారంగా సంబంధిత సిబ్బంది పై చర్యలకు ఉపక్రమించడం జరిగిందని తెలిపారు. ప్రజలకి జవాబుదారీతనం కలిగి పౌర సేవలు అందించడం విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బిక్కవోలు మండలం తోస్సిపూడి పంచాయతీ సెక్రటరీ డి. విజయ రాజు విధుల్లో బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించిన తీరు పై స్థానిక అనపర్తి శాసనసభ్యులు ఫిర్యాదు నేపథ్యంలో విచారణ అనంతరం విధులు నుంచి సస్పెండ్ చెయ్యడం జరిగింది. సీతానగరం మండలం రఘుదేవపురం (ప్రస్తుతం హుకుంపేట) పంచాయతీ కార్యదర్శి కె ఎస్ రాజశేఖర్ నిధుల దుర్వినియోగంపై సస్పెన్షన్ చేస్తూ, వసూలు చేసిన పన్నుల మొత్తంలో దుర్వినియోగం చేయడంపై పొరుగు సేవలు సిబ్బంది టి.లాల్ కుమార్ ను విధులను తొలగిస్తూ, పంచాయతి బిల్ కలెక్టర్ వై. అర్జునుడు ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. అదే విధంగా కడియం మండలం దుళ్ళ (ప్రస్తుతం చిన కొండేపూడి) పంచాయతి సెక్రటరీ బి.సరోజ రాణి విధుల్లో నిర్లక్ష్యం కారణంగా సస్పెన్షన్ చెయ్యడం జరిగింది. తాళ్లపూడి మండలం పోచవరం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఈ ఎన్ రామలక్ష్మి తప్పుడు తేదీతో జన్మ దిన ధృవపత్రం జారీ చేసిన విషయములో క్రిమినల్ కేసు నమోదు చెయ్యడం జరిగిందనీ, విధులు నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు.




స్టేట్ బ్యాంక్ అఫ్ హైదరాబాద్ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు నిండిన సంఘం సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కే.నరహరి, వి.పి.రాజేంద్ర ముఖ్య అతిథి లో పాల్గొని సభ్యులను శాలువా మెమోటోతో సత్కరించారు. సంఘ అధ్యక్షుడు ఎమ్.చక్రపాణి ఆధ్వరంలో జరిగిన ఈ సమావేశంలో కే.రోహిణీ రావు, ఉప్పు సుధాకర్, పి.వి.జి.కే.మూర్తి, రవికుమార్, మోహన్ రవీందర్, సాయి రెడ్డి, బి.ప్రభాకర్, తివారి, అశోక్ కులకర్ణి, రమణ మూర్తి, అచ్చుత్ రావు తదితరులు పాల్గొన్నారు.

*-అంబర్ పేట, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):*

## ఒంటి కాలిపై సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



**జగిత్యాల, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** జగిత్యాల జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె 21 వ రోజుకి చేరింది, విద్యా శాఖలో గత 15 సంవత్సరాలనుండి పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందిని విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చెయ్యాలని ఉద్యోగులంతా ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు.

## కరీంనగర్ లో ఈస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయండి

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కు బిఎంఎస్ నేతల విజ్ఞప్తి



**కరీంనగర్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** కరీంనగర్ లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్ పార్లమెంటు కార్యాలయంలో బిఎంఎస్ నేతలు మంత్రి బండి సంజయ్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ లో వేల మంది కార్మికులు, ఈఎస్ఐ కార్డుదారులు ఉన్నారని ఆసుపత్రి ఏర్పాటుతో కార్మికులకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో కి వస్తాయని, ఇది కార్మికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. తక్షణం కరీంనగర్ లో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బి ఎం ఎస్ నేతలు బండి సంజయ్ ని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎంస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్, జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, నక్క అరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవు

### జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్



**సంగారెడ్డి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** జిల్లా ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణం లో జరుపు కోవాలని జిల్లా ఎస్పి చెన్నూరు రూపేష్ పేర్కొన్నారు. డిసెంబర్ 30, 31 తేదీల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ప్రజల శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిసెంబర్ 31 రోజున ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టనున్నామని, మద్యం తాగి వాహనాలు నడిపే వ్యక్తులను జైలుకే పంపించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే, వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నూతన సంవత్సర వేడుకల్లో డీజేలు, అధిక శబ్దం కలిగిన బాక్స్‌లు వినియోగించడం పూర్తిగా నిషేధించబడిందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత పరికరాలను సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి పదార్థాలను విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. నూతన సంవత్సరం వేడుకల పేరుతో అక్రమ మద్యం రవాణా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమని, ఎవరైనా పోలీసులు చెప్పిన సూచనలు పాటించకపోతే డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ప్రజలు కుటుంబ సభ్యులతో సంతోషంగా, జాగ్రత్తలతో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని పేర్కొన్నారు. ఎస్పీ ప్రజలందరికీ ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రేమ్ నగర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి రమేష్, అడ్మినిస్ట్రేషన్ ఉపాధ్యక్షుడు జూలూరి తిరుపతి గుప్తా హరిబాబు, వెంకటేశం గుప్త శరణమయ్య, శ్రీనివాస్ రమేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.
*–అంబర్ పేట, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):*

# ఏడాది గడిచినా మల్కాజ్గిరికి నిధులు ఇవ్వరా..?

### సమస్యల పరిష్కారం కోసం జిహెచ్ఎంసి కమిషనర్ కు ఎమ్మెల్యే మర్రి వినతిపత్రం





**మల్కాజిగిరి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** మల్కాజిగిరి నియోజకవర్గ రెండు సర్కిళ్ల పరిధిలోని సమస్యల పై బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మరో సారి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ ను కలిసారు. సమస్యలు వివరించి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా మల్కాజిగిరి నియోజకవర్గానికి మాత్రం నిధులు కేటాయించడంలో విఫలమయ్యారని, ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని యుద్ధప్రాతిపదికన నిధులు సమకూర్చి, పనులు ప్రారంభించాలన్నారు. రెండు బడ్జెట్ సమావేశాలు జరిగాయి కానీ, నిధులు అందడం లేదని, ఇదే సమస్యల పై గతంలో ఉన్న ఇద్దరు బల్దియా కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశామని సమస్యల తీవ్రతను నూతన కమిషనర్ కు వివరించామని తెలిపారు. దయచేసి చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే ప్రజలు హర్షిస్తారని కమిషనర్ తో జరిగిన బేటిలో తాను కోరినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశాంతి, శ్రీనివాస్ రెడ్డి, డోలి రమేష్, అనిల్ కిషోర్ విజయ్ శేఖర్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** జిల్లాలో గుర్తించిన ప్రాంతాలలో నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన డి.ఎల్.ఎస్.సి( డిస్టిక్ లెవెల్ స్యాండ్ కమిటీ) సమావేశం ఏర్పాటు చేశారు. మాగనూర్ మండలం అడవి సత్యవార్ కు చెందిన నలుగురు రైతులు, వర్కూర్ కు చెందిన మరో రైతు తమ పట్టా భూముల నుంచి ఇసుకను తొలగించాలని దరఖాస్తుచేసుకోగా సోమవారం నాటి సమావేశంలో ఆ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఇసుక తరలింపు విషయంలో మైనింగ్, రెవెన్యూ, భూగర్భ జల శాఖ, సర్వే ల్యాండ్, నీటి పారుదల, వ్యవసాయ శాఖల అధికారుల నివేదికలు,అభిప్రాయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మైనింగ్ ఏడి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు ఇచ్చిన నివేదికలన్ని సరిగ్గా ఉన్నాయని, దరఖాస్తుదారుల పట్టా భూముల నుంచి ఇసుక తొలగించేందుకు అనుమతులు ఇవ్వ వచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్ని శాఖల అధికారులు రిపోర్టుల ఆధారంగా అనుమతికి కలెక్టర్ అంగీకారం తెలిపారు. అయితే టీజీఎండీసి ద్వారా ఆయా భూములలో ఉన్న ఇసుకను తరలించేందుకు ఎన్ని వాహనాలు అవసరమవుతాయని, ఎన్ని రోజుల సమయం పడుతుందని అధికారులతో చర్చించారు. ఇసుకను తరలించే ప్రాంతాలలో సీసీ కెమెరాలు, వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే కఠిన చర్యలు

### నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

### కొత్తకోట సీఐ రాంబాబు



**కొత్తకోట, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే కఠిన చర్యలుంటాయని సోమవారం కొత్తకోట సీఐ రాంబాబు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కొత్తకోటతో పాటు వనపర్తి నియోజకవర్గంలోని పెబ్బేరు, శ్రీరంగాపూర్ పెద్దమందడి, ఖిల్లా ఘనపూర్ నాలుగు మండలాల పోలీస్ స్టేషన్ పరిధిలో డిసెంబర్ 31 రాత్రి 9 గంటల నుండి తెల్లవారు జామున 4 గంటల వరకు ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో 50 మంది ట్రాఫిక్ సిబ్బంది నాలుగు టీంలుగా ఏర్పడి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. రాష్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ చేసిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరూ మద్యం సేవించి వాహనం నడపరాదని, నడిపి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మద్యం తాగిన తర్వాత రాత్రి సమయంలో బయటికి వెళ్లాలి అనుకుంటే మద్యం సేవించని వారిని డ్రైవర్ గా పెట్టుకొని వెళ్లాలని సూచించారు. కొత్తకోట సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధి ప్రజలకు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రాంబాబు సూచించారు.

# చారిత్రక వరంగల్‌కు బస్టాండ్ ఏది

- కబ్జాలు సెటిల్మెంట్ లతో కాంగ్రెస్ బిఆర్ఎస్ నేతల బిజీ
- బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వరంగల్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మాయల మరాఠీ పార్టీలని గంట రవికుమార్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే వరంగల్ బస్టాండ్ పేరుతో నయవంచన చేస్తే.. ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ అసమర్థతతో బస్టాండ్ నిర్మాణానికి నోచుకోవడం లేదని మండిపడ్డారు. చారిత్రక నగరమైన వరంగల్‌కు బస్టాండ్ నిర్మాణానికి ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో వరంగల్ ఆత్మగౌరవ పోరాటం పేరుతో సోమవారం బీజేపీ వరంగల్ బస్టాండ్ ఏర్పాటు ప్రాంతంలో మహా ధర్నా చేపట్టింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర రెండో రాజధానిగా వరంగల్‌ను తీర్చిదిద్దుతామంటూ ప్రగల్భాలు పలుకుతున్న సర్కారు.. కనీసం వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టడం లేదంటూ మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ మంత్రిగా ఉన్నా.. పట్టించుకోకపోవడం ఆమె అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల ముందు అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోట్ల రూపాయలతో కొత్త బస్టాండ్ నిర్మిస్తామంటూ ఇదిగో.. నమూనా బస్టాండ్ అంటూ మాయమాటలు చెప్పి ఉన్నదానిని కూల్చాడని మండిపడ్డారు. ఆ తర్వాత కనీసం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదన్నారు. కాకతీయుల ఆర్థిక రాజధానిగా, పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న వరంగల్‌కు కనీసం బస్టాండ్ లేకపోవడం ఏంటని పర్యాటకులు ముక్కుమీద వేలు వేసుకుంటున్నారని వాపోయారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హృదయ్, అమృత్, స్మార్ట్ సిటీ వంటి ఎన్నో పథకాలకు భారీగా నిధులు కేటాయించి వరంగల్‌ను ప్రగతిదారిలో నడిపిస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం ఓరుగల్లు చరిత్రను భ్రష్టు పట్టిస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులు ఒక్కఅడుగు ముందుకు పడకపోయినా ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీలకు ఓట్లు తప్ప వరంగల్ అభివృద్ధిపై కనీస పట్టింపులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల భూముల్ని కబ్జా చేయడంలో సెటిల్‌మెంట్ పనుల్లో ఆ పార్టీల నేతలు బీజీబిజీగా ఉన్నారని, ఇక వారికి ప్రజా సమస్యలు ఏం పడతాయంటూ ఆరోపించారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో మాజీ మేయర్ టి రాజేశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్ , రత్నం సతీష్ షా, గురుమూర్తి శివ, వన్నాల వెంకటరమణ, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు వంగాల సమ్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్ రాణా ప్రతాప్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నల్లా కనెక్షన్..

# ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



**అంబర్ పేట, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** అంబర్ పేట చే నెంబర్ లోని వైన్ షాప్, టెంట్ హౌస్ లా యాజమానులు ఓ స్వీట్ హౌస్ కు సంబంధించిన నల్లా కనెక్షన్ ద్వారా అక్రమంగా మంచినీటిని తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇక్కడ ఉన్న స్వీట్ షాప్ కు సంబంధించిన నల్లాకు వీరు మోటర్లు పెట్టి అక్రమంగా వాడుకుంటున్నారు. ఈ అక్రమ నీటి వాడకంపై గత ఆరు నెలలుగా స్థానిక ప్రజలు జలమండలి అంబర్ పేట సబ్ డివిజన్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో చే నెంబర్ చౌరస్తాలో పరిమళ గురురాజా పేరునా స్వీట్ హౌస్ ఉండేది. అయితే రోడ్డు విస్తరణలో మడిగేలో కొద్ది భాగం కూల్చివేయడంతో స్వీట్ హౌస్ ను అక్కడి నుండి ఎత్తివేశారు. అయితే ఈ స్వీట్ హౌస్ కు సంబంధించిన రెండు కమర్షియల్ నల్లా కనెక్షన్లు భూమిలోనే ఉండిపోయాయి. ఈ రెండు నల్లా కనెక్షన్ కు సంబంధించి లక్ష రూపాయలకు పైగా బిల్లు బకాయి ఉండి పోయింది. ఇలాంటి కనెక్షన్లను గుర్తించి డమ్మీ చేయాల్సిన జలమండలి అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇదే అదనుగా ప్రస్తుతం అక్కడ ఉన్న టెంట్ హౌస్, వైన్ షాప్ ల యజమానులు స్వీట్ హౌస్ కు సంబంధించిన రెండు కమర్షియల్ నల్లా కనెక్షన్ల ద్వారా నీటిని అక్రమంగా తీసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భూమిలో కూరుకుపోయిన నల్లా కనెక్షన్లను సదరు యజమానులు బయటకు తీయించి, మోటార్ల ద్వారా అక్రమంగా వైన్ షాప్ కు, టెంట్ హౌస్ కు మంచినీటిని తీసుకుంటున్నారని వారు తెలిపారు. ఈ విషయమై సాక్షదారాలతో సహా జలమండలి డీజీఎం, మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లిన వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మురికివాడ బస్తీలలో పేదలు ఒక నెల నల్లా బిల్లు కట్టకుంటే కనెక్షన్ కట్ చేసి అధికారులు, అందరూ చూస్తుండగా ఇతరుల నల్లా కనెక్షన్ ద్వారా ఆ క్రమంగా నీటిని పొందుతున్న వైన్ షాప్, టెంట్ హౌస్ యజమానులపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తుందని ప్రజల ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా వాటర్ వర్క్స్ అధికారులు ఇప్పటికే సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

# గోవిందా దీక్ష భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించాలి

### అనంత గోవింద దాస్ ట్రస్ట్, గోవింద పీఠం భక్తులు డిమాండ్



**తిరుపతి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** తిరుపతిలోని దీక్ష భక్తులకు ప్రతి ఏడు వైకుంఠ ద్వార దర్శనము కల్పించేందుకు టిటిడి ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించి తద్వారా గోవింద మాలా దీక్ష భక్తులకు ప్రత్యేక దర్శన ఏర్పాటు చేయాలని అనంత గోవింద దాస ట్రస్ట్ గౌరవాధ్యక్షులు శ్రీధర్, ప్రబోధానంద లు కోరారు. తిరువూరు ప్రెస్ క్లబ్ లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఆధ్యాత్మి ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రమైన తిరుపతి నగరంలో నివాసముండే గోవింద మాలాధారణ దీక్ష భక్తులు 1984వ సంవత్సరం నుంచి గోవింద మాలలు ధరించి తిరుమలకు వెళ్లి దీక్షను విరమించి శ్రీవారి దర్శనం చేసుకునే వారమని, అయితే ఇటీవల టీటీడీ తీసుకున్న నిర్ణయాల ద్వారా గోవింద మాల ధారణ భక్తులకు శ్రీవారి దర్శనం కష్టతరం అవుతుందని వారు ఆవేదన చెందారు. సనాతన ధర్మ పరిరక్షణ చేయాల్సిన టిటిడి మాలాంటి భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించుటలో అలసత్వ చూపుతోందని వారు ఆవేదన చెందారు. ఆన్ లైన్ దర్శన టోకెన్ లు తీసుకోమని టిటిడి చెబుతుందని కాగా ఆన్లైన్ టోకెన్లు మారుమూల గ్రామాలలో దీక్ష తీసుకున్న భక్తులకు వీలుపడటం లేదని వారు పేర్కొన్నారు. 9వ తేదీ ఎనిమిది కేంద్రాలలో టోకెన్లు ఇస్తామని తెలిపింది. అయితే టోకెన్లు పొందలేని దీక్షాదారులకు ప్రత్యేక కౌంటర్ ను ప్రారంభించి టోకెన్ జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. మాలాదారుల్లో ఉన్న భక్తులకు అన్ని దేవాలయాలలో ప్రత్యేక దర్శనం సౌకర్యం కల్పిస్తున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకొని తిరుమల తిరుపతి దేవస్థానం కనీసం 8 కేంద్రాల్లో ఒక కేంద్రాన్ని దీక్షాదారుల కోసం కేటాయించాలని వారు విన్నవించుకున్నారు, టిటిడి బోర్డు సభ్యుడైన భాను ప్రకాష్ రెడ్డి, ఈ విషయంలో జోక్యం చేసుకొని తమకు అవకాశం కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ మీడియా సమావేశంలో గోవింద మాల ధారణ దీక్ష భక్తులు పాల్గొన్నారు.

# జవాబుదారీతనం కోసం.. ట్రాఫిక్ పోలీసులకు సిసి కెమెరాలు

### శరీరానికి ధరించే కెమెరాలను అందజేసిన రాచకొండ సిపి



**మల్కాజ్గిరి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పారదర్శకత పెంచేలా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందిలో జవాబుదారీ తనం, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం రాచకొండ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది శరీరానికి ధరించే కెమెరాలను ప్రవేశపెట్టడం జరిగింది. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 50 శరీరానికి ధరించే కెమెరాలు రాచకొండ ట్రాఫిక్ విభాగపు సబ్–ఇన్‌స్పెక్టర్లు ఇన్‌స్పెక్టర్‌లు వంటి ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌లకు సిపి సుధీర్ బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కెమెరాలను అధికారులు విధి నిర్వహణలో ఉన్నప్పుడు ధరిస్తారు. తద్వారా ప్రజలతో వారి ప్రవర్తన, పరస్పర చర్యలు రికార్డ్ అవుతూ ఉంటాయి. ఈ విధానం యొక్క లక్ష్యం పారదర్శకత, జవాబుదారీతనం, శరీరానికి ధరించే కెమెరాల ద్వారా ట్రాఫిక్ అధికారులు, ప్రజల మధ్య జరిగే పరస్పర చర్యలు రికార్డ్ చేయబడి వివాదాలు, ఫిర్యాదుల అవకాశం తగ్గుతుంది. అధికారుల ప్రవర్తన మెరుగుపడుతుంది. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా, విధుల్లో ఉన్నప్పుడు అత్యున్నత ప్రమాణాల ప్రవర్తనకు కట్టుబడి ఉండేలా అధికారులను ఈ కెమెరాలు ప్రేరేపిస్తాయి. మెరుగైన ప్రజా విశ్వాసం, అధికారులు, సిబ్బంది ప్రవర్తనా చర్యలు ఎప్పటికప్పుడు రికార్డు అవడం ద్వారా ప్రజలకు నమ్మకం పెరగడంతో పాటు అధికారులతో ప్రజలు సంయమనంతో, సవ్యంగా వ్యవహరించేందుకు అవకాశం ఉంటుంది. ఖచ్చితమైన సాక్ష్యాధారాల సేకరణ, ట్రాఫిక్ ఉల్లంఘనలు, వివాదాలు లేదా పరిశోధనల విషయంలో రికార్డ్ చేయబడిన ఫుటేజ్ నమ్మదగిన సాక్ష్యంగా ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు మాట్లాడుతూ ట్రాఫిక్ విభాగ పనితీరు ఆధునీకరించడానికి పోలీసులకు ప్రజలకు మధ్య విశ్వాసాన్ని పెంపొందించడానికి చేస్తున్న విశేష ప్రయత్నాలలో భాగంగా శరీరానికి ధరించే కెమెరాల పరిచయం ఒక మైలురాయి వంటిదని పేర్కొన్నారు. రహదారి భద్రతను మరింతగా పెంచడమే కాక ప్రజలు, పోలీసుల మధ్య పారదర్శక వ్యవస్థను మరింతగా పెంపొందించడానికి వీలైనంత ఎక్కువగా సాంకేతికతను ఉపయోగిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. శరీరానికి ధరించే కెమెరాల వాడకం అధికారుల వృత్తి నైపుణ్యాన్ని నిపెంపొందించడమే కాకుండా పోలీసు డిపార్ట్‌మెంట్‌పై ప్రజలకు నమ్మకం విశ్వాసాన్ని పెంపొందిస్తుందని ఈ సందర్భంగా సిపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి ట్రాఫిక్ వి.శ్రీనివాసులు, డిసిపి ట్రాఫిక్ ఎస్.మల్లా రెడ్డి, డిసిపి ఎస్ఓటి ఎ.రమణా రెడ్డి, డిసిపి ఎస్ఓటి మురళీధర్, ప్రదీప్ బాబు, ఇన్స్పెక్టర్, రామ లక్ష్మణ రాజు కుషాయిగూడ ట్రాఫిక్ పీఎస్, నరసింహ, మల్కాజిగిరి ట్రాఫిక్ పీఎస్, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సబ్–ఇన్స్పెక్టర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధులకు గుర్తింపు కార్డులు అందజేత

### ఘట్కేసర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి

**ఘట్ కేసర్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** 60 సంవత్సరాలు దాటి వృద్ధులైన ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డు చాలా అవసరమని ఘట్కేసర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో, టిఆర్ఎస్ పార్టీకి చెందిన వీరేష్ గుప్తా, ఎండి నజీర్ ల ఆధ్వర్యంలో వయో వృద్ధ సంక్షేమం గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వృద్ధులందరికీ గుర్తింపు కార్డు ఎంతో అవసరం అని అన్నారు. ఈ గుర్తింపు కార్డు వల్ల కలిగే లాభాలు చాలా ఉంటాయని సూచించారు. ప్రభుత్వం ద్వారా కలిగే కొన్ని రాయితీలు లభిస్తాయని తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యపరంగా హాస్పటల్లో, ఆర్టీసీబస్సుల్లో, రైళ్లల్లో, బ్యాంకులలో వారికి తగిన సౌకర్యము కల్పిస్తారని వివరించారు. ఇంత చక్కటి కార్యాన్ని తలపెట్టిన వీరేశం గుప్తా, నజీర్, రంగయ్య, సోమయ్య, నాగరాజు లకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వృద్ధులైన మడిపడగె లక్ష్మయ్య కే.నరసింహ రెడ్డి బండారి రాందాస్ కోటేశ్వరరావు లంబ మల్లేష్ తదితరులకు ఆయన గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా సోషల్ మీడియా సభ్యులు ఎండి నజీర్, 9వ వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు విద్యార్థుల విరాళం




**పెబ్బేరు, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** వరద బాధితుల సహాయార్థం వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు సామాజిక బాధ్యతగా, స్వచ్ఛందంగా సేకరించిన విరాళాలు 6,21,100(ఆరు లక్షల ఇరువై ఒక్క వేల ఒక వంద), ఈ మొత్తాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించడం జరిగింది. అట్టి విరాళాల వివరాలను సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి చేతుల మీదుగా బహిర్గతం చేయడం జరిగింది. విరాళాలు సేకరించిన విద్యార్థులను, సహకరించిన ప్రిన్సిపాల్స్ ను, ఈ కార్యక్రమాన్ని రూపొందించిన ఇంటర్ విద్యాధికారి ఎర్ర అంజయ్యను జిల్లా కలెక్టర్ అభినందించారు.

# బీర్షెబా చర్చిలో క్రిస్మస్ వేడుకలు



**ఉప్పల్ద, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** ఉప్పల్ గణేష్ నగర్ లో బీర్షెబా చర్చి లో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్టమస్ పండగ అంటే ప్రేమను పంచే పండగ అని అన్నారు. మానవ సంబంధాలు కొరవడుతున్న ప్రేమను, క్షమాపణ అనే గుణంతో తిరిగి భూమిపై పుననారుద్ధరిం చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ లింగంపల్లి రామకృష్ణ, మనోహర్, పాస్టర్ వరప్రసాద్, బాబు, దేవదానం, జోసెఫ్ పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ కారీ బ్యాగులపై ప్రత్యేక డ్రైవ్

### తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి రవి గుగులోతు




**హైదరాబాద్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు సమాజంలో పెద్ద ఎత్తున వస్తూ వ్యవస్థను తీవ్రమైన ఇబ్బందులకు, నష్టానికి గురి చేస్తున్నాయని, వాటిని నియంత్రించే చర్యలు చేపట్టాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్సీ హెచ్ రంగయ్య సోమవారం తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్య కార్యదర్శి రవి గుగులోతును కలిసి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో స్థానికంగా నిర్వహించే వారాంతపు సంతల్లో ఈ ప్లాస్టిక్ వినిమయం భయ పెడుతోందని, అంతేగాక అనేకమంది చిరు వ్యాపారులు పెద్దస్థాయిలో వీటి వాడకాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. అంతేగాక సరైన నిర్వహణ లేక గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కొండల్లా పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని, పలు చోట్ల దహనం జరుగుతున్న వైనం సంస్థ గుర్తించిందని కార్యదర్శి దృష్టికి తీసుకుపోయారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే అనేక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన పొల్యూషన్ బోర్డు కార్యదర్శి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై త్వరలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ముద్రణ చేస్తున్న ఎన్విరాన్మెంట్ యాక్టివిస్ట్ మాసపత్రిక సంచికను అందజేశారు.

# లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి కోటి 63 లక్షల మంజూరు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

### విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణంతో కర్నే తాండ లిఫ్ట్ ప్రారంభం

### వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి



**పెబ్బేరు, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** కర్నే తండా లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించిన విద్యుత్ ఉప కేంద్రాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరుతూ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సమర్పించిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి స్పందించి ఉపకేంద్ర నిర్మాణానికి సంబంధించి కోటి 63 లక్షల రూపాయలను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబర్ 345 ప్రకారం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణంతో కర్నే తాండ లిఫ్ట్ ప్రారంభమవుతుందని దాంతో ఖిల్లా ఘనపూర్ లోని జంగమ్మయాపల్లి, దొంతికుంట తండా కర్నె,తండా షాపుర్, లట్టుపల్లి లోని 6 తాండలకి 4400 ఎకరాలు ఆయకట్టుకు సాగునీరు అందజేయవచ్చునని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఉపకేంద్ర నిర్మాణానికి కావలసిన నిధులు మంజూరు చేయడానికి కృషి చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహకి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుకి,పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవికి, ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కలిసి తేదేపా విజయం సాధించాలి

### ముమ్మరంగా తెలంగాణలో టిడిపి సభ్యత్వాలు

**పెబ్బేరు, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** బక్కని నర్సింహా ద్వారా టీడిపి సభ్యత్వం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు అయిన సోమవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ తెలుగుదేశం పార్టీ పాలిటిబ్యూరో సభ్యులు బక్కని నర్సింహా సభ్యత్వాలు పొందడం జరిగింది. ఈ సందర్భంగా బక్కని నర్సింహాలు మాట్లాడుతూ పెబ్బేరు మండలంలో సభ్యత్వాలు బాగా జరుగుతన్నాయని అన్నారు. పట్టనంలో గ్రామాలలో జరుగుతున్న కార్యక్రమంపై అభినందలు తెలియచేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సభ్యత్వాలు తీసుకోవడం జరిగింది,ఎస్సీ ఎస్టీ బీసీ బడుగు బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం అని తెలంగాణలో అధికారంలోకి రావాలని ఉత్సాహంగా సభ్యత్వాలు తీసుకున్నారు. సభ్యత్వాలు తీసుకొని తద్వారా పార్టీని బలోపేతం చేయాలని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కలిసి విజయం సాధించాలని కోరారు. నిర్మాణాత్మక ప్రతి పక్షంగా పనిచేయాలని తెలిపారు. వనపర్తి నియోజకవర్గం మొత్తం నడిచి తిరిగిన అనుభవంతో పార్టీ పునర్వైభవమే కార్యాచరణగా అనునిత్యం శ్రమిస్తూ, నిబద్ధత గల కార్యకర్తలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామన్ గౌడ్, వాకిటి బాలరాజ్ శ్రీనివాస్ గౌడ్ వెంకటేశ్వర్లు తదితరులు పాలొగొన్నారు.



## విద్యార్థులపై దాడి చేసిన ప్రిన్సిపాల్

### వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కి ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

**వలిగొండ, డిసెంబర్ 30(నిఘా న్యూస్):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కి ఎస్ఎఫ్ఐ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ లావుడియా రాజు మాట్లాడుతూ మోడల్ స్కూల్లో చదువుతున్న 20 మంది విద్యార్థినులపై బాధ్యతగా భరోసా కల్పించాల్సిన ప్రిన్సిపాల్ విద్యార్థినులపై దాడికి పాల్పడడం సరైనది కాదన్నారు. ఈ దాడిలో ఇద్దరు విద్యార్థినిలకు చెయ్యి విరిగిందని కనీసం తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ ను విచారిస్తే బాధ్యతరహితంగా మకు సంబంధం లేదు మీ పిల్లలు ఎక్కడ పడ్డారో అని దాటవేత ధోరణి ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తపరిచారు. ఇలాంటి విధానాలు సరైన్నవి కాదన్నారు వెంటనే మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేయాలన్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, కొలనుకొండ సతీష్, భవాని శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## స్థాయికి మించి వైద్యం చేసిన 12 మందిపై కేసులు

### ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు తప్పనిసరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.వెంకటరమణ



**వికారాబాద్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు స్థాయికి మించి వైద్యం అందిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ బృందం సభ్యులు గత నెల రోజుల నుండి జిల్లాలో పర్యటించి అర్హతకు మించి వైద్యం అందిస్తున్న ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారని తెలిపారు. అందులో భాగంగా తాండూరులో 7, పరిగిలో2, వికారాబాద్ లో 3 మొత్తం 12 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు అర్హతకు మించి వైద్యం అందించినట్లు నిర్ధారణ కావడంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ బృందం సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో 12 ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ ల పై కేసులు నమోదు చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫస్ట్ ఎయిడ్ కేంద్రాల వారు స్థాయికి మించి వైద్యం అందిస్తే శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని సూచించారు. అదేవిధంగా అర్హత కలిగిన డాక్టర్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి సంప్రదించి, తమ ఆసుపత్రులకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు.

## పాకాల సంతలో నిషేధిత చైనా వెల్లుల్లి



**చంద్రగిరి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజక వర్గం పాకాల మండలంలో పాకాల, దామలచెరువు లలో స్థానికంగా నిర్వహించే వారపు సంతలో చైనా తెల్లగడ్డలు దర్శనం ఇవ్వడంతో ప్రజలు ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే భారత ప్రభుత్వం చైనా తెల్లగడ్డలను నిషేధించిన విషయం పలు ప్రసార మాధ్యమాల్లో కథనాలు వచ్చినప్పటికీ వారపు సంతలో ఏదేచిగా చైనా వెల్లుల్లి అమ్మకాలపై అధికారులు పర్యవేక్షణ కొరవడంతో ప్రజల ఆరోగ్యం పెను ప్రమాదంలో పడిందని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వెల్లుల్లి వాడటం వలన గ్యాస్ట్రిక్ ఉదరకోశ వ్యాధులు, కిడ్నీలో రాళ్లు తదితర సమస్యలు తలత్తే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ భూమిని తిరిగి అప్పగించిన మాజీ సర్పంచ్

- ఆక్రమణకు గురైన రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ వెల్లడి



**రాజన్నసిరిసిల్ల, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** రాజన్న సీరిసిల్ల జిల్లాలోని తంగాళ్లపల్లి మండలం లోని లక్ష్మి పురం గ్రామంలో ఆక్రమణకు గురైన రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని లక్ష్మీపురం మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ తిరిగి ప్రభుత్వానికే అప్పగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రభుత్వ భూమి అప్పగింత పై ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ 2018 సంవత్సరంలో తాడూరు గ్రామ సర్వే నెంబర్ 545/1/1/3/1లో గల 2ఎకరాల భూమి ప్రభుత్వం తనకు కేటాయించిందని, 2ఎకరాల భూమిని మాజీ సర్పంచ్ పద్మ ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదురు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఈ భూములను పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని, పేద ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. 2018 నుంచి 2023 వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉంటూ రైతు బంధు మొదలైన ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందినందుకు ఆ సొమ్ము రికవరి కోసం డిమాండ్ నోటీసు జారీ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన లేక... డాక్టర్ల దోపిడీకి బలవుతున్నారు

### బాలికలు మహిళల ఆరోగ్య సమస్యలపై సెమినార్



**కీసర, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** జన విజ్ఞాన వేదిక కీసర మండల కమిటీ ఆధ్వర్యంలో అంకిరెడ్డిపల్లిలో గల మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్లో బాలికల,మహిళల ఆరోగ్య సమస్యలపై సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ సెమినార్ లో వక్తగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాంధీ మెడికల్ కాలేజ్ గైనకాలజీ డిపార్ట్మెంటల్ హెడ్ డాక్టర్ రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లల్లో చిన్నతనం నుండే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. యవ్వన దశలో యువతులలో వారి శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయని, ఈ మార్పులతో కొంతమంది యువతులు భయాందోళన గురికావడం మానసికంగా సమస్యలు పెంచుకోవడం నేడు అధికంగా సమాజంలో పెరుగుతున్నాయి ఈ ఆరోగ్య సమస్యలపై బాలికలకు,యువతులకు అవగాహన అవసరమని ఈ సెమినార్లను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని వారు అన్నారు. నేటి యువతులు, మహిళలు వారి ఆరోగ్య సమస్యలపై సంపూర్ణ అవగాహన లేక అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వారి ఆరోగ్య సమస్యలపై పూర్తి అవగాహన పెంచుకొని వాటి నివారణకు సరైన మార్గం ఎంచుకోవడం ద్వారానే వారు త్వరగా ఈ ఆరోగ్య సమస్య నుంచి బయటపడతారని, అనేక ప్రైవేట్ హాస్పిటల్లలో ఆరోగ్య సమస్యలపై అనేక రకాల టెస్టులు చేయించి అందరి నుండి డబ్బులు దండుకుంటున్నారని ఆరోగ్య చిట్కాలతో అనేక సమస్యలను తగ్గించుకోవచ్చని విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ డి. రాజమణి, రాష్ట్ర నాయకులు పిట్టల నాగరాజు, ముప్ప శ్రీనివాస్, జిల్లా కోశాధికారి జెన్నీ, ముప్పా ఆశ, పాఠశాల అధ్యాపకులు డి స్వప్న, ఎన్ ఆదిలక్ష్మి, హెల్త్ ఇన్చార్జ్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## అన్నోజిగూడ వద్ద త్వరలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం

### ఈ విషయంపై పార్లమెంటులో చర్చ జరిగింది ఎంపీ ఈటల రాజేందర్ వెల్లడి



**ఘట్‌కేసర్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** అండర్ పాస్ బ్రిడ్జి అవసరమేనని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై అన్నోజిగూడ ఎన్‌టిపిసి చౌరస్తా వద్ద అండర్ పాస్ బ్రిడ్జి వేయాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు ఇటీవల ఎంపీ ఈటల రాజేందర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేసిన విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో సోమవారం ఆయన అండర్ పాస్ బ్రిడ్జి స్థలాన్ని పరిశీలించి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాలలో ఇట్టి అండర్ పాస్ విషయాన్ని చర్చించినట్లు ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా ఈ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడతామని అన్నారు. ఈ రోడ్డు మార్గాన ఎంతో మంది అమాయకులు రోడ్డు దాటుతుండగా మరణించారని చైర్మన్ కొండల్ రెడ్డి, బిజెపి పోచారం మున్సిపాలిటీ అధ్యక్షులు నానావత్ సురేష్ నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, గొంగళ్ల మహేష్, ఘట్కేసర్ మండల మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, ఆకిటి బాల్ రెడ్డి, మహేష్ జి, నానావత్ జితేందర్ నాయక్, నల్లవెల్లి రమేష్ ముదిరాజ్ జవాజి అశోక్ ముదిరాజ్ రేతి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షాపై ఎస్సి ఎస్టీ కేసు నమోదు చేయాలి



**విజయవాడ, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** పార్లమెంట్ లో అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను మంత్రి మండలి నుండి తొలగించాలి, అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేయాలి, శిక్షించాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మ లపల్లి కళాక్షేత్రం నుండి స్వరాజ్యమైదాన్ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు.

## ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు ఫిర్యాదు చేస్తేనే కూల్చివేతలు

### ప్రభుత్వ స్థలాన్ని పాఠశాల ప్రాంగణంలో కలపాలి 12వ డివిజన్ కార్పోరేటర్ బోమ్మక్ కళ్యాణ్ కుమార్ మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేత



**బోడుప్పల్, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్ దేవేందర్ నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు అనుకొని ఉన్న 63/1 ప్రభుత్వ స్థలంలో అక్రమార్కులు కబ్జా చేసి గుడిసెలను వేశారు. దీనిపై స్థానిక కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణాలను మున్సిపల్, రెవిన్యూ అధికారులు కూల్చివేశారు. ప్రభ్వత పాఠశాలలో విద్యార్థులకు ఆటస్థలం లేనందున ఆ ప్రభుత్వ స్థలాన్ని పాఠశాలలో కలుపుతూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని బోడుప్పల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విధంగా చేయడంతో విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలం విశాలంగా ఉంటుందన్నారు. స్పందించిన కమిషనర్ త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## అంతర్జాతీయ త్రో బాల్ పోటీలో ప్రసన్నకు స్వర్ణ పథకం




**మేడ్చల్, డిసెంబర్ 30(నిఘా న్యూస్):** అంతర్జాతీయ త్రో బాల్ పోటీల్లో స్వర్ణపతకం సాధించిన దళిత ఆణిముత్యం మేడ్చల్ ముద్దుబిడ్డ కత్తి ప్రసన్నకి మేడ్చల్ నియోజకవర్గ ఎ బ్లాక్ అధ్యక్షులు పానుగంటి మహేష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ ప్రాంతం చెందిన అమ్మాయి ఎంతో కష్టపడి చిన్న వయసులో త్రోబాల్ అంతర్జాతీయ స్థాయిలో గెలుపొంది, అంతర్జాతీయ త్రో బాల్ పోటీలో రెండవసారి భారతదేశం ద్వార ఆడి స్వర్ణపతకం సాధించిన ప్రసన్నకి శుభాకాంక్షలు తెలుపుతూన్ననని భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు. ప్రసన్న గతంలో కూడా నేషనల్, ఇంటర్నేషనల్, అంతర్జాతీయ స్థాయిలో, ఆడి ఎన్నో పతకాలు సాధించిందని తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ జట్టుకి కెప్టెన్ గా కూడా వ్యవహరించిందని తెలిపారు.

## శెట్టిపల్లి భూ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

- జనవరి నెల 5 నాటికి 4 లేఅవుట్లకు, సంక్రాంతి నాటికి రెండు లేఔట్‌లో ప్రాసీడింగ్స్ ప్రతులను లబ్ధిదారులకు అందిస్తాం
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్
- ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి, డిసెంబర్ 30 (నిఘా న్యూస్):** దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న శెట్టిపల్లి భూ సమస్యల పరిష్కార దిశలో చర్యలు చేపట్టామని, వచ్చే జనవరి నెల 5నాటికి 4లే అవుట్లకు, సంక్రాంతి నాటికి రెండు లేఔట్‌లో ప్రొసీడింగ్స్ ప్రతులను లబ్ధిదారులకు అందిస్తామని, శెట్టిపల్లి భూ పరిష్కారానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని ఎలాంటి అపోహలు వద్దని, శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సంయుక్తంగా పేర్కొన్నారు. సోమవారం తిరుపతి నియోజకవర్గం శెట్టిపల్లి గ్రామం నందు ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు నందు తిరుపతి ఎంఎల్‌ఏ, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, తహసీల్దార్ భాగ్యలక్ష్మి తదితర సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.శెట్టిపల్లి సాధన సమితి వారు, పలువురు ప్రజలు, సంఘాల నాయకులు శెట్టి పల్లి భూసమస్యలపై పలు అంశాలు జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 6వతేదీ నుండి వచ్చే నెల జనవరి 8వ తేదీ వరకూ 33రోజులు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని, తక్కువలో తక్కువ అంటే 1.5 సెంట్లు ఇంటి స్థలాన్ని ఇవ్వడం జరుగుతోందన్నారు. కలెక్టర్ గా తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి, శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారంపై పలుసార్లు సమావేశం అధికారులతో నిర్వహించడం జరిగిందని అన్నారు. అలాగే గత కలెక్టర్ ప్రస్తుత ముఖ్యమంత్రి సెక్రటరీ ప్రద్యుమ్న ఈ మధ్యనే శ్రీకాళహస్తి నందు నిర్వహించి సమావేశంలో శెట్టి పల్లి భూ సమస్యల పరిష్కార దిశగా చర్చించడం జరిగిందని వారు దిశా నిర్దేశం చేశారని తెలిపారు. శెట్టిపల్లి భూములకు సంబంధించి మున్సిపల్ శాఖ రెవెన్యూ శాఖ రెండు శాఖల మంత్రులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్‌గా తాను, ముఖ్యమంత్రి సెక్రటరీ కలిసి పది రోజులలో సంక్రాంతికి మునుపే సమావేశం నిర్వహించి ప్రతిపాదనలను క్యాబినెట్‌కు పంపడం జరుగుతుందని తెలిపారు. 12పెండింగ్ లేఔట్ లలో జనవరి 5వ తేదీ కల్లా నాలుగు లేఔట్ల ప్రొసీడింగ్స్ సంబంధిత లబ్ధిదారులకు అందిస్తామని, అలాగే మిగిలిన రెండు పెండింగ్ లేఅవుట్లను సంక్రాంతి నాటికి పూర్తి చేసి ప్రొసీడింగ్స్ అందిస్తామని తెలిపారు. జనవరి 30 నాటికి అధికారికంగా పేపర్ మీద లేఔట్ ప్లానింగ్ చేసి ప్లాట్లను లబ్ధిదారులకు చూపడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తిరుపతి జిల్లాకు వచ్చినప్పుడు శెట్టిపల్లి భూములకు సంబంధించిన సమస్యపై పరిష్కారానికి దిశా నిర్దేశనం చేశారని లే అవుట్లను త్వరితగతిన చేయాలని సూచించారని గుర్తు చేశారు. అలాగే పలువురు శెట్టిపల్లి లో డ్రైనేజీ నిర్వహణ, పారిశుధ్యం, వీధి దీపాలు అంశాలపై సమస్యలు తెలపగా తిరుపతి మున్సిపల్ కమిషనర్ ను పరిశీలించవలసిందిగా కలెక్టర్ సూచించారు. ఎంజాయ్ మెంట్ లో ఉన్న వారికి ఒకటిన్నర సెంటు భూమి అందిస్తామని ఆయన తెలిపారు. మల్టిపుల్ రిజిస్ట్రేషన్ లు ఎన్ని జరిగాయో రెవెన్యూ అధికారులు గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అబ్జెక్షన్ పోరంబోకులో ఉన్న వాటిని అనుమతించలేమని స్పష్టం చేశారు.



ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ శెట్టిపల్లి సమస్య సుమారు 60 సంవత్సరాలపైగానే ఉన్న సమస్య అని 2014-19 సంవత్సరం మధ్యలో టిడిపి ప్రభుత్వం శెట్టిపల్లి భూములపై జీవో ఇవ్వడం జరిగిందని గుర్తు చేస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారని ఇక్కడ సమస్యలు వారికి అవగాహన ఉందని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. చిత్తశుద్ధి కలిగిన కలెక్టర్, అధికారులు ఉన్నారని ఇప్పటికే 1410 మందికి ఇంటి స్థలాలు 74.31 ఎకరాలు ఇచ్చారని,248 మంది రైతులకు వ్యవసాయ భూములు 137.18 ఎకరాలు,48 మందికి మెట్ట భూములు 46.55 ఎకరాలు ఇచ్చారని అన్నారు.ఈ సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్, రెవెన్యూ యంత్రంగం విశేష కృషి చేస్తున్నారని అన్నారు.శెట్టిపల్లి భూములు చాలా విలువైనవని ఇక్కడ జనాభా ఎక్కువగా ఉందని,శెట్టిపల్లి అభివృద్ధికి నారా లోకేష్ 147 ఎకరాలలో ఐటి హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తద్వారా భూముల విలువ పెరుగుతుందని, స్థానిక యువతకు మంచి ఉపాధి కలిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు.శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో చిత్తశుద్ధితో అధికారులకు సూచనలు ఇస్తూ త్వరితగతిన పరిష్కారానికి చొరవ చూపుతున్నారని ప్రశంసించారు. అనంతరం ప్రజల నుండి కలెక్టర్, ఎంఎల్‌ఏ, సంబంధిత అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్ రెడ్డి,ఆర్ ఐ రామ చంద్ర రెడ్డి, తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com